



# బైక్‌పై వెళ్లి.. పంటలను పరిశీలించి

- ఖానాపూర్ మండలంలోని గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది ■ ప్రతీ రైతుకు నష్టం పరిహారం చెల్లిస్తాం


ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ బుధవారం | 3 సెప్టెంబర్ 2025 | ■ 17 పేజీలు



- బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌తో అయోమయంలో గులాబీ, జాగృతి కేడర్
- కలిసి పని చేసిన గులాబీ, జాగృతి శ్రేణులు..
- బీఆర్ఎస్‌లో కొనసాగడమా..? వెళ్లడమా..?
- సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న నాయకులు
- ఇన్నాళ్లు జాగృతిలో కీలకంగా పని చేసిన ఉమ్మడి జిల్లా శ్రేణులు బీఆర్ఎస్ వైపే..
- 'నల్ల'నేల నేతలు అండగా నిలుస్తారా..?
- ఇప్పటికే టీజీబీకేఎస్ నుంచి కవితకు చెక్
- కవితకు సత్సంబంధాలు అంతంత మాత్రమే
- తాజా పరిణామాలపై ఉమ్మడి ఆదిలాబాద్ గులాబీ శ్రేణుల్లో ఉత్కంఠ

9లో





# కవిత వెంట నడిచేదెవరు!?

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ, కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ ఎపిసోడ్... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉత్కంఠ రాజకీయాలకు తెరతీసింది. ఊహించినట్టుగానే బీఆర్ఎస్ అధిష్ఠానం కవితను పార్టీ నుంచి గెంటేయడంతో అటు బీఆర్ఎస్, ఇటు జాగృతి శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. తాజా పరిణామాలతో గులాబీ కండువాతో పాటు జాగృతి కండువా కప్పుకుని పని చేసిన నేతలు.. ఎటుపోవాలో తేల్చుకోలేని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితపై పార్టీ అధిష్ఠానం వేటు వేయడం కలకలం రేపుతోంది. పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడుతుండటంతో కవితను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లుగా అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. బీఆర్ఎస్‌లో కొనసాగడమా..? జాగృతి వెంట నడవడమా..? అనేది ఉత్కంఠగా మారింది. తాజా పరిణామాల్లో దృష్ట్యా జాగృతి నేతలు గులాబీ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. విభజిత జిల్లాల్లోని కవిత అనుచర నేతల స్టాండ్ ఏమిటనేది ఇంకా తేలాల్సివుంది. బీఆర్ఎస్‌లో కీలక నేతలు, అసంతృప్తనేతలు కవిత వెంట నడుస్తారా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.



2

## పంట నష్టపోయిన ప్రతీ
# రైతుకు పరిహారం అందిస్తాం

- రాష్ట్ర కార్మిక, శాఖ మంత్రి గడ్డం వివేకానంద ■ కాళ్వేరంతో రైతులకు తీవ్ర నష్టం
- గోదావరి బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పంటల పరిశీలించిన మంత్రి
- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం ■ రైతులు అధైర్యపడొద్దు..
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ముంపు గ్రామాల్లో మంత్రి విస్తృత పర్యటన

## చట్టాలపై
# అవగాహన ఉండాలి

- 'పోక్సో'పై అవగాహన ఉండాలి
- జిల్లా జడ్జీ ప్రభాకర్ రావు..
- లైంగిక నేరాలు నివారించాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- నిర్భయంగా ఫిర్యాదు చేయండి
- ఎస్పీ అఖిల్ మహాజన్..
- బాలల హక్కుల పరిరక్షణ, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి
- జూనియర్ సివిల్ జడ్జి పొన్నపల్లి మౌనిక






# బీఆర్ఎస్ శ్రేణుల కన్నెర్ర

- ఆందోళనలతో అట్టుడికిన ఉమ్మడి జిల్లా
- సీఎం రేవంత్ రెడ్డి ఫొటోలు దహనం
- ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాల హోరు
- ఆదిలాబాద్‌లో పాల్గొన్న రామన్న
- ఆయా నియోజకవర్గాల్లో గులాబీ శ్రేణులు

**కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన బాటపట్టాయి.** విచారణ కోసం సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు రాస్తారోకో, ధర్నాలు నిర్వహించారు. మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఎండగట్టాయి.

# పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తాం

- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం
- కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు నష్టం
- వర్షాన్ని లెక్కచేయకుండా మంత్రి పర్యటన..
- రాష్ట్ర కార్మిక, శాఖ మంత్రి గడ్డం వివేకానంద







**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండలం సుందర శాల గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన నష్టపోయిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా గత 5 సంవత్సరాల నుండి రైతులు పంట నష్టపోతున్నారని, గత సంవత్సరం కూడా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం జరిగిందని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో ప్రాజెక్టు లేని సమయంలో కూడా రైతులు సాధారణం కంటే 70 శాతం అధికంగా పంట దిగుబడి సాధించారని, ఇలాంటి సందర్భంలో ఈ సంవత్సరం పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేసే విధంగా నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. సుమారు 200 ఎకరాల మేర పంట నష్టం జరిగినట్లు రైతులు రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో స్పష్టమైన నివేదికలు రూపొందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. దుగ్నేపల్లి గ్రామపంచాయతీలోని పెద్దగూడెం, నారాయణపూర్ గ్రామాలలో పర్యటించి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాల వరకు అమలు చేస్తుందని తెలిపారు. గ్రామంలో నీటి అవసరాలను తీర్చేందుకు బోర్ వెల్‌లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉన్న బ్రిడ్జిని కూల్చారు

# నిలిచిన రాకపోకలు

### ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జైనథ్ మండలంలోని నూతన బోరజ్ మండలంలో గల తర్నం వాగుపై కొత్త బ్రిడ్జి నిర్మించకముందే ఉన్న పాత బ్రిడ్జిని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూల్చి వేయించి ప్రజల రాకపోకలకు మరింత ఇబ్బందులకు గురి చేశారని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ ఆరోపించారు. వాగు దాటలేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ... తాత్కాలికంగా ప్రజల రాకపోకల కోసం 4 కోట్లతో నిర్మించిన లో లెవెల్ వంతెన సైతం తరుచూ చిన్నపాటి వర్షం వస్తే చాలు వరదల్లో మునిగిపోతోందన్నారు. కొత్త వంతెన నిర్మించక ముందే ఉన్న పాత వంతెనను కూల్చివేయడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వరదలు వచ్చినప్పుడు కనీసం పాత బ్రిడ్జిపై నుండి కాలినడకన, ద్విచక్ర వాహన రాకపోకలు జరిగేవని ఇప్పుడు దాన్ని కూల్చివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూన్నారని పేర్కొన్నారు. గతంలో పాయల్ శంకర్ వంతెనకు ఇరువైపుల అంబులెన్స్‌లు ఏర్పాటు చేసే వారిని, మరి ఎమ్మెల్యే అయ్యాక అంబులెన్స్‌లు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, పురుషోత్తం, ఉశన్న, తదితరులు ఉన్నారు.

# డిజిటల్ జనరల్ క్రాప్ట్ ఎస్టిమేషన్ సర్వేను పకడ్బందీగా చేయాలి







### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జరుగుతున్న డిజిటల్ జనరల్ క్రాఫ్ట్ ఎస్టిమేషన్ సర్వేను లోపాల్లేకుండా ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. సర్వే ప్రక్రియలో ప్రతి అధికారి పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పొరపాట్లు లేకుండా సర్వే చేయడం వల్ల పంట దిగుబడి రేట్ల అంచనాలు పారదర్శకంగా వెలువడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కొద్ది రాష్ట్రాల్లో మాత్రమే ఈ డిజిటల్ సర్వే అమలులో ఉందని, దీని ద్వారా ఖచ్చితమైన పంట దిగుబడి వివరాలు లభిస్తాయన్నారు. మొత్తం 68 పంటలపై ఈ సర్వే నిర్వహించాలని, రైతుల సమస్యలను తెలుసుకొని వారికి సరైన అంచనాలు అందించడం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా రైతులు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందేలా అధికారులు సర్వే చేసి, నివేదికలను సిద్ధం చేసి పంపాలన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి జీవరత్నం, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్, పాల్గొన్నారు.

# నిర్మల్ పోలీస్-మీ పోలీస్

### శాంతిభద్రతల రక్షణే పోలీసుల ధ్యేయం
### నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల



**ముథోల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ గ్రామంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రలు శాంతియుతంగా, సురక్షితంగా జరగడానికి జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలైన ఏర్పాట్లు చేయటం జరిగిందని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ముథోల్ మంగళవారం జరిగే గణేష్ శోభాయాత్ర కోసం సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది నియమించబడి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గణేష్ బందోబస్తు విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా జిఎం గార్డెన్‌లో సమావేశమై మధ్యాహ్నం ఎస్పీ పలు సూచనలు చేశారు. శాంతి భద్రతలు కాపాడడమే మన ప్రధానకర్తవ్యమని, ప్రతి ఒక్కరు తమ తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ శోభాయాత్రలో పాల్గొనే భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రూట్ మ్యాప్ ప్రకారం శోభాయాత్ర సాఫీగా కొనసాగే విధంగా చూడాలన్నారు. శోభాయాత్ర మార్గాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా బారికేడింగ్, ట్రాఫిక్ డైవర్షన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ పోలీసు విభాగం తరపున బలమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ముథోల్ గ్రామంలో ముఖ్య రహదారులపై ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేస్తూ, ప్రత్యేక పోలీసు బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతల భంగం కలిగించే ఎటువంటి సంఘటనలుజరగకుండా సమన్వయంతో, ఓపికతో పనిచేయాలని సూచించారు.గణేష్ శోభాయాత్ర రూట్‌ను పరిశీలించి, అవసరమైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, నిమజ్జన ఘాట్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద అదనపు బందోబస్తు అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి,భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### పంట నష్టపోయిన రైతులకు

# పరిహారం అందించాలి

**లక్ష్మణచందా, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
లక్ష్మణచందా మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. తీర్పల్లి వాగు బ్రిడ్జి, చామన్ పల్లి వాగు బ్రిడ్జిలను పరిశీలించారు. వరద ఉధృతి వల్ల వాగుపై నుండి నీరు రావడంతో రాకపోకలకు, చుట్టుపక్కల పొలాలు ముంపుకు గురవుతున్నాయని తెలపడంతో అధికారులను ఆదేశించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, ముత్యం రెడ్డి, భూపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేష్, శ్రీధర్ రెడ్డి, సురేష్, లక్ష్మణ్, వెంకట్ రెడ్డి తో పాటు మండల నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- ఖానాపూర్ మండలం బాదనకుర్తి వంతెనపై బీఆర్ఎస్ నిరసన

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాల హోరు - భారీగా నిలిచిపోయిన వాహనాలు





**ఖానాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అబద్దాలకోరు ప్రభుత్వమని ప్రజలను రైతులను నిండా ముంచి, అబద్ధపు హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని నిరసిస్తూ ఖానాపూర్ మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు మండలంలోని బాదనకుర్తి గోదావరి నది వంతెనపై నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో సుమారు గంటన్నర పాటు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజా గంగన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నిలబెట్టుకునే దిశగా పాలన చేయడం మరిచిపోయి రాష్ట్రంలో కేసిఆర్ పేరుపై బురద జల్లడమే పనిగా పెట్టుకుందని కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతుందని ఆ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాధారం కాగా తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కంకణం కట్టుకొని కేసీఆర్ను కారణం లేకుండా దోషిగా నిలబెట్టేందుకు సర్వశక్తులు వడ్డుతుందని కేసిఆర్ శాశ్వతంగా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోతాడు. రాష్ట్రం రాకముందు గోదావరిలో నెత్తురు పారితే ప్రస్తుతం కేసీఆర్ పాలన అనంతరం కూడా జలకల సంతరించుకోవడం కేవలం కేసీఆర్ పాలనతోనే సాధ్యమైందని వారు అన్నారు. పార్టీలకు అతీతంగా రైతులందరూ కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందించాలి

### నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
గిరిజనులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని టీఎన్జీవో హాల్ లో ఆధికర్మయోగి పథకం పరిధిలో మూడు రోజులపాటు జరిగే బ్లాక్ మాస్టర్ శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా సంక్షేమ పథకాల లబ్ది చేకూరేలా అధికారులు కృషి చేయాలనీ ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు గిరిజనులకు అందినప్పుడే ఆర్థిక, సామాజిక ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, సిపిఓ జీవరత్నం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టరేట్‌లో వినాయక పూజలు



**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం వినాయక నిమజ్జన పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వినాయకుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, ఐశ్వర్యం నెలకొని, సమాజం అభివృద్ధి చెందాలని అన్నారు. విగ్రహదాత, లడ్డూ వేలంలో గెలుచుకున్న వారికి కలెక్టర్ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బందికి గణపతి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పూజా కార్యక్రమం అనంతరం ఉద్యోగులు, సిబ్బంది వినాయకుని శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం భక్తిగీతాలకు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి, వినాయక్ సాగర్ (బంగల్‌పేట్) చెరువులో గణనాథుని నిమజ్జనం చేశారు.



## బాధ్యతలు చేపట్టిన డీఈఓ

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా నూతన విద్యాధికారిగా నియమితులైన భోజన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఆ తర్వాత డీఈఓగా బాధ్యతలు చేపట్టారు. నిర్మల్ డీఈఓ గా ఉన్న రామారావు స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. జనగామ జిల్లా విద్యాశాఖ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ గా పనిచేస్తున్న భోజన్న ను నిర్మల్ డీఈవోగా నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో పాఠశాల విద్యను గాడిన పెడతానని నూతన డిఇఓ భోజన్న పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా పై తనకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలను సమన్వయం చేస్తూ జిల్లాను ఉత్తమ స్థాయిలో నిలబెట్టే ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డిఇఓ పరమేశ్వర్, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాజేశ్వర్, స్టాటిస్టికల్ అధికారి మిరియాల భానుమూర్తి, లింబాద్రి ఉన్నారు.

## అడా ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తివేత

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా రాత్రి నుంచి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొమురం భీం అడా ప్రాజెక్టులోకి 13,681 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు మంగళవారం ప్రాజెక్టు 1.5 మీటర్ల మేర నాలుగు గేట్లను ఎత్తి 12,639 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వాగులో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.



## వినాయకునికి పూజలు

**ఖానాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ పట్టణంలోని వివిధ కాలనీలో గల వినాయక విగ్రహాలను మంగళవారం మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం సందర్శించి పూజలు నిర్వహించారు. గణేష్ నవ రాత్రి ఉత్సవాలకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా ఈ ఉత్సవాలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.






## తృటిలో తప్పిన పెను ప్రమాదం

### 24 గంటలు ట్రాఫిక్ జామ్

**ఉట్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఉట్నూర్ నుండి హైదరాబాద్‌కు సోమవారం రాత్రి వెళుతున్న ప్రవేట్ బస్సు మండలంలోని బీర్సాయి పేట్ సమీపంలోకి రాగానే బస్సు ముందు టైర్లు రోడ్డుకు మధ్యలోనే ఊడిపోయాయి. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పి బస్సు ముందుకు కదలలేక ఆగిపోయింది. ఈ క్రమంలోనే 24 గంటల పాటు ట్రాపిక్ జామ్ అయ్యింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి నుండి మంగళవారం రాత్రి వర కు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరా బాద్ ఇతర ప్రాంతాల నుండి ఉట్నూర్ మీదిగా ఆదిలాబాద్‌కి వెళ్ళే ప్రయాణికులు, ఇటుగా ఉట్నూర్ మీదుగా ఇతర ప్రాం తాలకు వెళ్ళే ప్రయాణికులు తిప్పలు ఎదుర్కొన్నారు. మంగ ళవారం పోలీసుల చొరవతో ఆదిలాబాద్ నుండి వచ్చిన క్రేన్ సహాయంతో ఆ బస్సును పక్కకు జరపడంతో రాకపోకలు ప్రారంభం అయ్యాయి.



## తుపాకి తూటాలకు, లాటి దెబ్బలకు భయపడితే
# నాయకుడిని అయ్యేవాడిని కాదు

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- సీబీఐ అంటే కాంగ్రెస్, బీజేపీ ఇన్వెస్టిగేషన్ సంస్థ
- కాళేశ్వరంపై ప్రభుత్వ తీరు నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి చెన్నూర్‌లో ఆందోళన..

**చెన్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
తుపాకి తూటాలకు లాటి దెబ్బలకు అధికార పార్టీ అక్రమ కేసులకు భయపడే వాడినైతే నాయకుడిని అయ్యేవాడి నీ కాదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు "అప్పుడే బాగుండే"కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 420 అబద్ధాలు చెప్పి ఉచిత పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారానీ ఆయన తెలిపారు. చెన్నూర్ నియోజక వర్గంలో కంపెనీ ఏర్పాటుచేసి 40 వేల మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ప్రజలను మోసం చేసి మంత్రి పదవి పొందిన వెంకట స్వామి నీ ప్రజలు నిలదీయాలని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఉద్యోగాలు ఇప్పించడంలో విఫలమైన వివేక్ కుటుంబంలో మాత్రం ముగ్గురికి ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఆయన అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాలేశ్వరం బ్యాక్ వాటర్ తో పంటలు నీటిలో మునిగిపోతున్నాయి అని అబద్ధాల మాటలు చెప్పి గోదావరి చుట్టూ కరకట్టలు కట్టిస్తానని వాగ్దానాలు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అమల్లోకి నోచుకోలేదని



ఆయన వెల్లడించారు.. అక్రమ ఇసుక మాఫియా, బియ్యం మాఫియా రాజ్యమేలుతున్నప్పటికీ మంత్రి నోరు మెదపడం లేదని ఆయన అన్నారు. చెన్నూరు పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సమ్మక్క సారక్క భవనం, వంద పడకల ఆసుపత్రి ,రెండు సంవత్సరాలు గడిచిన ప్రారంభానికి నోచుకోలేదని 90 శాతం పనులు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పూర్తయినప్పటికీ కనీసం 10 శాతం పనులు పూర్తి చేసి వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవడంలో మంత్రి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. మంత్రి నియోజకవర్గంలో రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారని వర్షంలో తడుస్తూ గంటలకొద్ది లైన్ లో నిలిచినప్పటికీ యూరియా బస్తాలు దొరకడం లేదని ఆయన పేర్కొన్నారు. రెండు సంవత్సరాలలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలు తిరిగి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు వస్తారని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికలలో చెన్నూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి ప్రజల అభిమానంతో విజయం సాధించి అభివృద్ధి కి నోచుకోని చెన్నూరు పట్టణాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని అన్నారు. నాయకుల కార్యకర్తల పట్టణ ప్రజల అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు. చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన "అప్పుడే బాగుండే" కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన బాల్క సుమన్ ను వేలాదిమంది పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు కొత్త బస్టాండ్ ప్రాంతం నుండి వర్షం పడుతున్నప్పటికీ నాయకులు కార్యకర్తలు డీజే సౌండ్ పాటలతో నృత్యాలు చేస్తూ పాత బస్టాండ్ వరకు చేరుకుని సమావేశాన్ని ప్రారంభించారు.

## రాహుల్ దిష్టిబొమ్మ దహనం

**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ గర్మిళ్ల జోనల్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా మాట్లాడడంతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తల్లి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడుసార్లు దేశ ప్రజలు తిరస్కరించిన రాహుల్ గాంధీకి సిగ్గు రావడం లేదని ఆయన విమర్శించారు. ప్రపంచ దేశాలు మోడీని కీర్తిస్తుంటే, తట్టుకోలేక రాహుల్ గాంధీ వ్యక్తిగత విమర్శలకు దిగడం బాధాకరమని, త్వరలోనే దేశ ప్రజలు రాహుల్ గాంధీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ జోన్ అధ్యక్షులు కర్రె చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి మేరడి కొండ. శ్రీనివాస్, బింగి.సత్యనారాయణ, రెడ్డి మల్ల. అశోక్, సుమన్, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రాజబాబు, కుమారస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.



## వినాయక శోభాయాత్రకు ఏర్పాట్లు

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర సాగే ప్రధాన అంతర్గత వీధులలో మరమ్మతులు చేపడుతున్నారు. జయశంకర్ జంక్షన్ నుండి వినాయక సాగర్ వరకు ఉన్న రహదారిపై గోతులను పూడ్చి, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరుకైన మార్గాల్లో చెట్ల కొమ్మలను కొట్టివేసి, విద్యుత్ తీగలను పైకి ఎత్తారు. ఈ పనుల్లో మాజీ కౌన్సిలర్ రఫ్ఫూ, నజీర్ ఖాన్, ఫురాన్ ఖాన్ పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నాయకుల నిరసన ఉద్రిక్తం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కాళేశ్వరం ప్రాజెక్ట్ పై తప్పుడు నివేదిక సమర్పించారంటూ మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది.అదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసనకారులు కలెక్టర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ చేయడంతో పాటు,సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని దహనం చేయడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. సీబీఐ అంటే కాంగ్రెస్, బీజేపీ ఇన్వెస్టిగేషన్ సంస్థ అని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి,ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబుకు కీలుబొమ్మగా మారారని పేర్కొన్నారు. మళ్లీ రాష్ట్ర అస్తిత్వం కూలిపోయే ప్రమాదంలో ఉందని.. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఏకం కావాలన్నారు. ఇందులో నాయకులు మెట్టు ప్రహల్లాద్,రమేష్, రాజన్న, కరుణ, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.






## ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరగాలి
### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్మల్ పట్టణ గణేష్ ఉత్సవ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ మండలి నిర్వాహకుల సమావేశంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన శోభాయాత్రలో ఏర్పడే ఇబ్బందులు నిర్వాహకులు తెలపడంతో సంబధిత అన్ని శాఖల అధికారులను ఆదేశించి ముఖ్యంగా డీజే పర్మిషన్లు, రోడ్డు మరమ్మతులు, ఎలక్ట్రిక్ సమస్యలు, తదితర అంశాల పట్ల అధికారులను ఆదేశించి సత్వర పరిష్కారం చేసి గణేష్ నిమజ్జన వేడుకలు సాఫీగా నిర్వహించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు మూర్తి ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు పతికే రాజేందర్, నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, అయ్యన్న గారి రాజేందర్, అర్జున్, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, జిల్లా బీజేపీ నాయకులు, పట్టణ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, నరేందర్, శంకర్ పతి, గణేష్, ఉత్సవ సమితి సభ్యులు హిందూ సంఘాల నాయకులు గోజ్జ జనార్ధన్, కందుల హరీష్, రవి పాల్గొన్నారు.

## కన్నెపల్లిలో బీఆర్ఎస్ నాయకుల నిరసన

**కన్నెపల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కన్నెపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రభుత్వం విధించిన సిబిఐ విచారణలు పూర్తిగా వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కెసిఆర్‌పై కక్షగట్టి ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజక వర్గ యువజన అధ్యక్షులు మహేష్ గౌడ్, మండల సీనియర్ నాయకులు ఆకుతోట రాజన్న, తలండి అశోక్, బండ గణేష్, దేవయ్య, రామన్న, సతీష్ పాల్గొన్నారు.



# వ్యర్థాలు తీయక.. దుర్వాసన వీడక

- కంపుకొడుతున్న కాలనీలు.. రహదారులు
- నీరుగారుతున్న ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం
- రహదారులను ముంచెత్తుతున్న చెత్తాచెదారం

**బెల్లంపల్లి, ఆగస్టు 14 (ప్రభాత సమాచారం)**
ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా పేరొందిన బెల్లంపల్లి బల్దియాలో చెత్త తొలగింపుపై అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. బల్దియాలో 34 వార్డులుండగా కొన్ని వార్డుల్లో మాత్రమే పేరుకుపోయిన చెత్త నిలువలను తొలగిస్తున్నారనే అపవాదును మూటగట్టుకుంటోంది. కొన్ని మున్సిపల్ వార్డులలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారినప్పటికీ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇక కార్మిక వాడలలో అస్సలు పట్టించుకోకపోతుండడంతో ఇళ్ల మధ్యనే చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని రామా టాకీస్ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వ్యాప్తి చెందుతుండడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కిరాణం వ్యాపారాలు కొనసాగుతుండడంతో నిత్యం చెత్త నిల్వలు పేరుకు పోతున్నాయని, మునిసిపల్ సిబ్బంది రోజుల తరబడి తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి వన్



టౌన్ పోలీస్ స్టేషన్ క్వార్టర్ల మధ్య చెత్తాచెదారం పేరుకు పోయి పందులు స్వైర విహారం చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే లేకుండా పోతున్నారు. ప్రతి వార్డుకు చెత్తను తొలగించేందుకు వాహనంతో పాటు సిబ్బందిని కేటాయిస్తున్నా పరిస్థితిలో మాత్రం ఎటువంటి మార్పు రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్లంపల్లి బల్దియాలో పలు వార్డుల్లో చెత్త తొలగింపు పై అధికారులు నిర్లక్ష్యం వీడాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తుంది.





### అర్హులైన లబ్ధిదారులందికీ

# ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

- రాజకీయ వివక్షకు తావులేకుండా అందిస్తాం
- మాది ప్రజల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం!
- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం!!
- ఇండ్ల పట్టాలు అందజేసిన రాష్ట్ర కార్మిక, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద..



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్లను అందించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతంలో గల ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, అధికారులతో కలిసి హాజరై లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్ల పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా అర్హులకు అందని రేషన్ కార్డులను ప్రభుత్వం అందించిందని, 500 రూపాయలకు రాయితీ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా పథకంలో 20వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేసి పంట సాగుకు ముందే పెట్టుబడి సాయం అందించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని, సాగు దశకు అనుగుణంగా రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు కార్యచరణ ప్రకారం యూరియా, ఇతర ఎరువులను అందించాలని, రైతులకు విక్రయించిన వాటికి సంబంధించి రసీదులు చారి చేయడంతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఇటీవల అక్రమ రవాణా జరుగుతున్న వాహనాన్ని పట్టుకొని కేసులు నమోదు చేయడం జరిగిందని, ఫర్టిలైజర్ డీలర్లు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులు, సాగు చేస్తున్న భూమి వివరాలు, ఆధార్ అనుసంధానం ప్రకారం అధిక మొత్తంలో యూరియా, ఇతర ఎరువుల కొనుగోలు చేసినట్లయితే వివరాలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందని తెలిపారు. రెండు పడక గదల ఇండ్లను అర్హులకు మాత్రమే అందిస్తామని, ఉద్యోగులు, ఇండ్లు కలిగిన వారు, అనర్హులకు కేటాయించడం జరుగదని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హులైన వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే ఇల్లు నిర్మించుకోవాలని, బిల్లులు మంజూరు చేసేందుకు సులభతరం అవుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల ఇందిరమ్మ ఇండ్లకు 1 లక్ష రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. అనంతరం 230 మంది లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా భీమారం మండల కేంద్రానికి చెందిన తగరపు కావ్య కు మంజూరు చేసిన 10 లక్షల రూపాయల విలువ గల సంచార చేపల విక్రయ వాహనం ప్రారంభించారు. ఇందులో 6 లక్షల రూపాయలు ప్రభుత్వం రాయితీ అందించగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 4 లక్షల రూపాయల స్వయం సహాయక సంఘాల రుణ సదుపాయం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి
- విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**వాంకిడి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, వంట సరుకులు, కూరగాయలు, తరగతి గదులు, హాజరు పట్టికలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రధానోపాధ్యాయురాలని వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకూడదని, దీర్ఘకాలంగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టులపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు ఇప్పటి నుండి సన్నద్ధం చేయాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు, స్నానపు గదులు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్త 24 గంటలు అందుబాటులో ఉండి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. తరగతి గదులు విద్యార్థులకు సబ్జెక్టులలో పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### ఎవరెన్ని కుట్రలు చేసినా

# కేసీఆర్‌ను ఏం చేయలేరు

**నెన్నెల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కాళేశ్వరం ప్రాజెక్ట్ పై రెండు సంవత్సరాలుగా ఆ కమిటీ ఈ కమిటీ అంటూ చేసిన ఎత్తుగడలు సాగకపోవడంతో కేసీఆర్‌ను బద్నాం చేసి కేసుల్లో ఇరికించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐకి కేసు అప్పగిస్తుందని మంచిర్యాల జిల్లా నెన్నెల మండల బీర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పంజాల విద్యాసాగర్ గౌడ్ విమర్శించారు. మంగళవారం మండలం కేంద్రంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై బురదజల్లే ఆరోపణలు చేస్తుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్ ను ఏమీ చేయాలేరన్నారు. రెండేండ్లుగా ఇక్కడి కమిటీలు చేసిన విచారణపై ప్రభుత్వానికి నమ్మకం లేదని అన్నారు. తప్పుడు కేసు పెట్టి కేసీఆర్‌ను బద్నాం చేసే రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 హామీలు మరిచి పోయి బురద రాజకీయాలు చేస్తున్నరని, కనీసం రైతులకు బస్తా యూరియా ఇవ్వలేని పార్టీ కాంగ్రెస్ అని మండి పడ్డారు. ఈ కార్యక్రంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్, పార్టీ నాయకులు సింగతి రామచందర్, ప్రతాప్ రెడ్డి, ఇబ్రహీం, పురంశెట్టి తిరుపతి, గోపాల్, తౌకల తిరుపతి, గొర్లపల్లి బాపు, మల్లేష్, రమేష్, మల్లేష్, తిరుపతి, ప్రవీణ్ యాదవ్, శంకర్, అంజన్న, మొగిలి, కృష్ణ, శ్రీశైలం, మురళి పాల్గొన్నారు.



# 41వ నేత్రదాన పక్షోత్సవాలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ లయన్ వి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అందోత్వ నివారణ సంస్థ సహకారంతో మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 40వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డి ముఖ్యఅతిథిగా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ గీతాంజలి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేత్రదానం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు.

### ఆరోగ్యశ్రీ పెండింగ్

# బిల్లులు విడుదల చేయాలి

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ డిమాండ్



**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కార్పొరేట్ వైద్యం పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారిందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రైవేటు ఆసుపత్రులు వరుసగా అల్టిమేటం జారీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 80 శాతం మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా, కేవలం 20 శాతం మంది మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షల వరకు పెంచి పేద ప్రజలు ఉచిత వైద్యాన్ని పొందవచ్చని చెబుతున్న ప్రభుత్వం, ఇప్పటివరకు ఎంతమంది పేద ప్రజలు రూ.10 లక్షల వైద్యాన్ని పొందారో చెప్పాలన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలన్నారు.

# దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన అనేక ప్రభుత్వ పథకాల గు రించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శంకర్, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రొడ్డ శారద, మాజీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షులు రాము, టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ ఆనంద్ పాల్గొన్నారు.






# రియల్ ఎస్టేట్ కబ్జాలను అడ్డుకోవాలి

- ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్న పట్టింపు లేదు
- ఎమ్మెల్యే, ఎంపీలు భూములపై దృష్టి సారించాలి
- పేదలకు ప్రభుత్వ భూములను కేటాయించాలి
- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ డిమాండ్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ భూములు కబ్జాలు అవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదసి రవీందర్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలు, ఇరిగేషన్ కాలువలు కూడా కబ్జాకు గురవుతున్నాయన్నారు. పట్టణంలోని మోదెల శివారులోని సర్వే నెంబర్ 59/అలోని ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని ఆరోపించారు. అదే విధంగా బోట్లకుంట, మంగలి కుంట, చాకలి కుంట చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని వివరించారు. బోట్లకుంటలోని ఇందిరమ్మ గద్దె ప్రాంతంలోని కెనాల్, ఆ పరిసర ప్రాంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్టు వెల్లడించారు. మున్సిపాలిటీ, మండలంలోని పలు చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ధారించాలన్నారు. ఈ కబ్జాలపై రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు చూసిచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలపాలని ప్రశ్నించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఎంపీ వంశీ కృష్ణ లు ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ స్థలం ఉంటేనే ప్రజల కోసం పలు కార్యాలయాలను నిర్మించవచ్చన్నారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు హద్దులు లేకుండా పోతున్నాయని,ఇప్పటికే మందమర్రి మండలంలో ఇదే విధంగా కబ్జాలు జరిగితే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి పలు ప్రభుత్వ భూములను కాపాడినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ప్రభుత్వ నిషేదిత భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్ పేర్ల తో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ నిషేధిత జాబితాలోని భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారో ఆయా శాఖల అధికారులకే తెలియాలన్నారు. నాలా కన్వర్షన్ లేకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు గండి కొడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీతో పలు గ్రామాల్లో వెంచర్లు వేసి చుట్టూ పక్కల ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నట్లు తెలిపారు. సరైన అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను విక్రయిస్తున్న కూడా అధికారులు మామూలుగా తీసుకుంటున్న నేపథ్యంలో త్వరలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు కూడా చేపడతామని హెచ్చరించారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై తమ వైఖరి మార్చుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడి వాటికి హద్దులను నిర్ణయించి, ఆ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూములను పేదవారికి కేటాయించాలని వారు కోరారు.



### యూరియా కోసం బెల్లంపల్లిలో
# బీఆర్ఎస్ ఆందోళన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయడంలో వైఫల్యాన్ని నిరసిస్తూ.. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకి దిగారు. బుధవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశారు. సకాలంలో యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని గులాబీ శ్రేణులు మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియాను సరఫరా చేయకుండా రైతులను ఇక్కట్లకు గురి చేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు నాట్లు వేసిన వెంటనే యూరియా అందించారని గుర్తు చేశారు. రైతులకు యూరియానే అందించలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయం చేస్తూ కేసీఆర్ పై నిందలు వేస్తున్నదని మండిపడ్డారు. విచారణను సీబీఐకి అప్పగించడంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.


# గణేషుని ఆశీర్వాదంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**చెన్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రజలు గణనాథుని ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొలువుదీరిన గణనాతుడికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజలకు ఉచిత పథకాలు అమల్లోకి తెచ్చామని పెండింగ్లో ఉన్న పథకాలను త్వరలోనే అమలు చేసే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం చెన్నూరు మండలంలోని సుందరశాల గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తో పంట నష్టపోయిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పరిశీలించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పత్తి పంట పూర్తిగా నష్టపోయిందని స్థానిక రైతులు మంత్రి దృష్టికి వివరించారు. సుమారు 200 ఎకరాల పంట నష్టపోయినట్లు రైతులు తెలిపారు. పంట నష్టం గురించి వ్యవసాయశాఖ అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకొని న్యాయం చేసే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# శిథిలావస్థకు చేరిన మండల విద్యాశాఖ భవనం



**కుభీర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రం కుభీర్ లోని విద్యాశాఖ కార్యాలయం ఎంఆర్‌సి భవనం గత ఐదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరి వెనుక భాగం మొత్తం కూలిపోయింది. దీంతో ఈ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయంలోని చిన్న గదిలోకి మార్చారు అప్పటినుండి ఉపాధ్యాయులకు నిర్వహించే సమావేశాలు ఆయా పాఠశాలల్లో నిర్వహించుకుంటూ నెట్టుకొస్తున్నారు. పాఠ్య పుస్తకాలు యూనిఫామ్ వస్త్రాలు కేజీబీవీలో భద్రపరుస్తున్నారు. సిబ్బంది పని చేసుకునేందుకు కనీస స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు ఉపాధ్యాయులు రిపోర్టు ఇవ్వాలన్న ఇతర పనుల మీద వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు మహిళా ఉపాధ్యాయులకు మరింత ఇబ్బందులు కలుగుతున్నాయి ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి నూతన ఎంఈఓ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు.



### ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు
# రూ.5 కోట్లు మంజూరు

### నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గంలో సీఆర్ఆర్ ఎస్‌పీ గ్రాంట్ ద్వారా ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజ్‌ల అభివృద్ధికి 5కోట్ల రూపాయలు మంజూరైనట్లు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు తెలిపారు. గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఈ నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిర్మల్ రూరల్ మండలంలో న్యూ పోచంపాడ్, అనంతపేట, కౌట్ల కే, భాగ్యనగర్, సారంగాపూర్ మండలంలో గోడిసెర, కంకేట, నారాయణపల్లె, వైకుంఠపూర్, వంజర్, నేతాజీ నగర్, లక్ష్మణచందా మండలంలో బోరెగావ్, కంజర్, చింతలచందా, చమన్‌పల్లి, తీర్పెల్లి, మామడ మండలంలో టెంబుర్ని, ఆదర్శనగర్, న్యూ లింగంపల్లి, దిలవార్‌పూర్ మండలంలో కంజర్, కదిలి గ్రామాలకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

# దొరికిన ఫోన్లను అందజేత

**నిర్మల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో పోగొట్టుకున్న ఫోన్లను కంప్లైంట్ ద్వారా పోలీస్ శాఖకు సమర్పించడంతో వాటిని సేకరించి పోగొట్టుకున్న లబ్ధిదారులకు సెల్ఫోన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మొత్తం 84 ఫోన్‌లను బాధితులకు అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు 16,31 ఫోన్లను స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అందజేశామని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ఈనెల 30 తారీఖు వరకు నిబంధనలు అమలు




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణ భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి సెప్టెంబర్ 30 వ తారీకు వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ - 1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని సూచించారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకో వాలన్నారు. నిబంధనలను అతిక్రమించి ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# సర్పంచులకు బకాయిపడ్డ నిధులను విడుదల చేయాలి



## ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్‌లో తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు సుర్వీ యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో వారి ప్రతినిధులు, భాజపా ముధోల్ శాసన సభ్యులు రామారావు పటేల్ మరియు సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబును కలిసి మాజీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం జరిగింది. సర్పంచ్లకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.670 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా భాజపా శాసన సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సర్పంచులు చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేయడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వమనేది నిరంతర ప్రక్రియ అని సర్పంచ్లకు పార్టీలను ఆపాదించడం అన్యాయమన్నారు. సర్పంచులు ఏ పార్టీ గుర్తు మీద గెలవకుండా స్వతంత్రంగా గెలిచారని వారికి బకాయిపడ్డ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సర్పంచుల పదవీకాలం పూర్తయిన తర్వాత రూ.150 కోట్ల పనులు చేయించారని వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డదని, వారి నిధు లు కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 22 నెలలలో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొ రేషన్, 15వ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎస్డీ ఎఫ్ నిధులను నిలిపివేసిందని తద్వారా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితిలో దాపురిం చిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పోతున్నా మని ఉవ్విళ్లూరుతున్న ప్రభుత్వం స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసి వాటిని కోలుకోలేని దెబ్బ తీసిందని విమర్శించారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు.



## సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేపట్టాలి

**సిర్పూర్ (యు), సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టిన పనులపై పూర్తి స్థాయిలో సోషల్ అడిట్ పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో కృష్ణారావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, సోషల్ అడిట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2024 నుండి 2025 వరకు ఈజీఎస్ ద్వారా సుమారు 3.40 కోట్ల పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో లేబర్ పేమెంట్‌తో పాటు మెటీరియల్ పేమెంట్ ఉన్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని రకాల రికార్డులు అడిట్ బృందానికి ఆపగించినట్లు తెలిపా రు. అడిట్ బృందం బుధవారం నుంచి ఆదివారం వరకు గ్రామ స్థాయిలో అడిట్ నిర్వహించాలని సోమవారం మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

## తుది ఓటరు జాబితా ప్రచురణ

**బెజ్జూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటర్ లిస్ట్ పబ్లికేషన్, ఫైనల్ పోలింగ్ స్టేషన్ వివరాలను మండలంలోని 22 గ్రామపంచాయతీలలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌరీ శంకర్, మూసాసోహెల్, సిబ్బంది పాల్గొన్నారు.



# మెనూ ప్రకారం భోజనం అందించాలి

## నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**సారంగాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
సారంగాపూర్ మండలం చించోలి (బి) సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర సంక్షేమ వసతి గృహాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మంగళవారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తరగతి గదులు వసతి గృహ గదులు, పాఠశాల పరిసర ప్రాంతాలు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మెరుగైన వసతులు కల్పించాలన్నారు. పాఠశాల ఆవరణలో నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిరోజు అన్ని పూటల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న విద్య, కల్పిస్తున్న వసతులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతూ, వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయో అని అడిగారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ భోజనం చేశారు.

# వైఎస్ఆర్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి



## టీ-పీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణక్క

**ఉట్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
వైఎస్ఆర్ ప్రజల కోసం చేసిన త్యాగాలు, సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు.మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఆయన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ఆర్ ప్రజల కోసం చేసిన త్యాగాలు, సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికీ ప్రజల జీవితాల్లో అనుసంధానమై ఉన్నాయని సుగుణక్క పేర్కొన్నారు.వైఎస్ఆర్ పాలన సామాన్యుడికి ఒక ఆశగా నిలిచిందన్నారు.108 సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి ఎన్నో పథకాలు నేటికీ కోట్లాది మందికి ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలే తమకు మార్గదర్శకమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామని అన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా

**బెజ్జూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
బెజ్జూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం మండలంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ సిబ్బంది ధర్నా చేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని 51 జీఓ సవరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను పరిశీలించిన అధికారులు



**బెజ్జూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని అంబేద్కర్ కాలనీ పాఠశాల మరియు టీడబ్ల్యూ పిఎస్ గోల్కొండ పాఠశాలను మండల విద్యాధికారిని జి సునీత బెజ్జూర్ పంచాయతీ కార్యదర్శి వైకుంఠం పరిశీలించడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయా పాఠశాలలో ఎలక్ట్రిసిటీ టాయిలెట్స్ మరియు కిచెన్ షేడ్స్ లాంటి వసతులను పరిశీలించడం జరిగిందన్నారు. నివేదికలను అడిషనల్ కలెక్టర్ మరియు సమాచార నిమిత్తం మరియు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందన్నారు.

# గణనాధున్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
వినాయక నవరాత్రులను పురస్కరించుకుని క్యాతనపల్లి మున్సిపాలిటీ 5వ వార్డు అమరవాది గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథుడి మండపాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజీవ్ చౌక్ ఏరియాలో ఏర్పాటు చేసిన అప్పుడే మంచిగా ఉండే మా గ్రామం నుంచి పోరాటం అనే కార్యక్రమనికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని అన్నారు. గణనాథుడి కృష్ణతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ డా.రాజా రమేష్, జీలకర మహేష్, సత్తయ్య పాల్గొన్నారు.



## పేకాట రాయుళ్ల అరెస్టు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
11 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు జైనూర్ ఎస్ఐ రవి తెలిపారు. జైనూర్ మండలంలోని పాట్నాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 11 మంది పేకాట రాయుళ్లను పట్టుకుని.. వారివద్ద నుంచి రూ.8.100 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎవరైనా పేకాట, నిర్వహించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

కలిమిలేముల తేడాలు లేకుండా అందరూ గణపయ్యని ప్రతిష్ఠిస్తారు.. ఘనంగా పూజలు చేసి, ఆయనికి ఇష్టమైన వంటకాల్ని నైవేద్యంగా పెడతారు. డప్పుల చప్పుళ్ల మధ్య తొమ్మిది లేదా 11వ రోజు గంగమ్మ ఒడికి చేరుస్తారు. కానీ నిర్మల్ జిల్లాలోని భోసి గ్రామం, తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దులోని పాలజ్‌లోని కర్ర గణేశునికి నిమజ్జనం ఉండదు. ఇలా చేయడం వెనుక ఏండ్ల నాటి చరిత్ర ఉంది.

- భక్తుల కోర్కెలు తీర్చే భోసి కర్ర వినాయకుడు
- 61ఏళ్లుగా నిమజ్జనానికి దూరం..
- యువకుల మాలధారణ
- గ్రామంలో ఒకే వినాయకుడు
- మహాదేవ్ ఆలయంలో పూజలు
- 11 రోజుల ప్రత్యేక పాటు విశేష పూజలు
- రాత్రి వేళల్లో కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- భోసిలో భక్తజన సందోహం
- మొక్కులు చెల్లించుకుంటున్న ప్రముఖులు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలి వస్తున్న వేలాది మంది భక్తులు
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులు

*అడుగడుగునా ఆదుకునే ఆది దేవుడికి రూపాలెన్నో.. రూపమేదైనా పాపాలు పరిహరించడమే ఆయనకున్న ప్రత్యేకత. అందుకే దేవుళ్లతోనే పూజలందుకుని ఆది దేవుడయ్యాడు. మనం మట్టి వినాయకుడిని చూశాం. ప్లాస్టర్ ఆఫ్ పారిసితో తయారు చేసిన వినాయకుడిని చూశాం.. కానీ 'భోసి'లో నవ్వులు ఒలక బోస్తున్న కర్ర గణేశుడు దర్శమిస్తాడు. 61 ఏళ్లుగా నిమజ్జనానికి దూరంఆ ఉంటూ.. ఏటా పూజలందు కుంటున్న కర్ర గణేష్‌పై 'మన లోకేశ్వరం' ప్రత్యేక కథనం.*







# 'భోసి' నవ్వుల కర్ర గణేష్

**ముథోల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** గణేశుని నవరాత్రులంటే ఊరూవాడా తేడా లేకుండా వీధికొక వినాయకుడినైనా ప్రతిష్ఠిస్తారు. కానీ, నిర్మల్ జిల్లా తానూర్ మండలం భోసి గ్రామంలో మాత్రం 61 ఏండ్ల నుంచి ఒకే ఒక్క వినాయకుడు దర్శనమిస్తున్నాడు. అది కూడా కొయ్యతో తయారై. 1963 ఈ వినాయకుడిని తయారు చేశారట. అప్పట్నించీ ఏటా వినాయక చవితి ఉత్సవాల్లో ఈ విగ్రహాన్నే ప్రతిష్ఠించి ఘనంగా పూజలు చేస్తున్నారు గ్రామస్తులు. పదకొండో రోజు విగ్రహాన్ని నిమజ్జనం చేయకుండా బావి నీళ్లను చల్లి ఊళ్లోని లక్ష్మీనారాయణ గుడిలో భద్రపరుస్తున్నారు. మళ్లీ తర్వాతి సంవత్సరం ఉత్సవాలకు ఆ విగ్రహానికి రంగులద్ది ప్రతిష్ఠిస్తారు. ఏటా ఇదే విగ్రహాన్ని పూజిస్తుండటం వల్లనే గ్రామంలో సిరిసంపదలు నెలకొన్నాయని చెప్తున్నారు ఊరిజనం. ఇక్కడ జరిగే వినాయక ఉత్సవాల్ని చూడ్డానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

## విగ్రహా తయారీదారు ఒక్కరే...

నిర్మల్ జిల్లాకు చెందిన పోలకొండ గుండాజీ 1918లో భోసి వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. మహారాష్ట్రలోని పాలజ్ విగ్రహాన్ని కూడా ఈయన తయారు చేశారు. అప్పటి గ్రామ సర్పంచ్ గంగాధర్, పురోహితుడు సిద్ధయ్య, గ్రామస్తులు నిర్మల్‌కు గుండాజీ దగ్గరకు వెళ్లి విగ్రహాన్ని తయారు చేయించి రూ.51 చెల్లించి తీసుకువచ్చారు. గుండాజీ ఉపవాస దీక్షలతో విగ్రహాన్ని తయారు చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా కర్ర వినాయకుడికి రంగులు వేసి నిమజ్జనం చేయకుండా ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మార్కెట్‌లో లభించే గణేష్ విగ్రహాన్ని ఈ కర్ర వినాయకుడితో కలిపి ప్రతిష్టించి పూజలు నిర్వహించి ఆ విగ్రహాన్ని 1నిమజ్జనం చేస్తూ వస్తున్నారు.

## 11 రోజులు ఉత్సవాలు...

గ్రామంలో కర్ర గణపతి విగ్రహం ప్రతిష్టించినప్పటి నుంచి ఉత్సవాల సమయంలో 11 రోజుల పాటుత ఆలయంలో దత్తాత్రేయ సప్తాహం కొనసాగుతుంది. మధ్యాహ్నం గీతా ప్రవచనం, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం సాయత్రం నిర్వహించే హారతి కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు హాజరై మొక్కుల చెల్లించుకుని మూడుపులు కడుతున్నారు.

## మాలధారణ..

గ్రామంలోని యువకులు కొన్ని ఏళ్లుగా గణపతి దీక్షలను చేపడుతున్నారు. ప్రత్యేక దస్తులతో 11 రోజుల పాటుత ఒక పూట భోజనం చేస్తూ గణపతి సేవలో నిమగ్నమవుతున్నారు. నిరంతరం వరసిద్ధి వినాయక నామ జపం వల్ల తాము కోరుకున్న కోరికలు నేరవేరుతున్నట్లు మాలధారులు చెబుతున్నారు.

## ఒకే వినాయకుడు..

వాడవాడలా వినాయకుడికి విగ్రహాలను ప్రతిష్టిస్తున్న ప్రస్తు రోజుల్లో భోసిలో మాత్రం ఒకే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించి గ్రామస్తులంతా కలిసి పూజలు నిర్వహిస్తూ ఐక్యతను చాటుతున్నారు. కర్ర వినాయకుడికి పూజలు నిర్వహిస్తుండడంతోనే విద్యాతంల సంఖ్య అధికమవుతూ పట్టభద్రులవుతున్నారని గ్రామస్తులు నమ్ముతున్నారు. ప్రభుత్వ కొలువుల్లో నియోజకవర్గంలోనే గ్రామానికి ప్రత్యేకత ఉంది.. గ్రామంలో ఇంటికో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులున్నారు. ఇక్కడి ప్రజలు వ్యాపారంలోనూ రాణిస్తున్నారు..

## భక్తులకు సౌకర్యాలు..

వినాయక ఉత్సవాల్లో నిత్యం వేల సంఖ్యలో వచ్చి దర్శించుకోనున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ప్రతీ రోజు గ్రామస్తులు, యువకులు అక్కడే ఉండి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా అన్నదానం నిర్వహిస్తున్నారు. అదే విధంగా దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తుల కోసం వైద్య శిబిరం, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించారు.

## కర్ర వినాయకుడి కృపతో సుఖసంతోషాలతో ఉన్నాం..



ప్రతీ సంవత్సరం గ్రామంలోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో గణేష్ కర్ర వినాయకుడిని ఏర్పాటు చేసి 11 రోజులు పాటు పూజలు నిర్వహిస్తాం.. కర్ర వినాయకుడి కృప వలనే గ్రామంలో సుఖసంతోషాలతో పాటు, ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్శనానికి వస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

**- బుసి మురళి**
**గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు**






# కవిత వెంట నడిచేదెవరు!?

■ బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌తో అయోమయంలో గులాబీ, జాగృతి కేడర్
■ ఇన్నాళ్లు కలిసి పని చేసిన గులాబీ, జాగృతి శ్రేణులు ■ బీఆర్ఎసలో కొనసాగడమా..? కవిత వెంట వెళ్లడమా.?
■ సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న శ్రేణులు ■ జాగృతిలో కీలక నేతగా ఉన్న ఉమ్మడి జిల్లా నేతలు బీఆర్ఎస్ వైపే..
■ కవితకు 'నల్ల'నేల నేతలు అండగా నిలుస్తారా..? ■ ఇప్పటికే సింగరేణి టీజీబీకేఎస్ నుంచి కవితకు చెక్
■ ముఖ్య నేతలతో సత్సంబంధాలు అంతంత మాత్రమే ■ తాజా పరిణామాలపై గులాబీ శ్రేణుల్లో ఉత్కంఠ

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితపై పార్టీ అధిష్ఠానం వేటు వేయడం కలకలం రేపుతోంది. పార్టీ వ్యతరేక కలాపాలకు పాల్పడుతుండటంతో కవితను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లుగా బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి తెలంగాణ జాగృతి పేరుతో కవిత బీఆర్ఎస్‌తో కలిసి పని చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ జాగృతికి బలమైన కేడర్ ఉండేవారు. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు ఆయన అనుచరులు అనేక మంది కీలక నేతలు తెలంగాణ జాగృతి కార్యక్రమాలు చేపట్టారు. ఏటా ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించటంతో మహిళలకు బాగా చేరువైంది. మంచిర్యాల జిల్లాలో కవితకు మంచిపట్టు ఉంది.. ఇటీవల ఆమె మంచిర్యాల జిల్లాలో పర్యటించి జాగృతి నేతను పరామర్శించారు. అంతే కాకుండా సింగరేణి కార్మికులు, విద్యార్థులను కలుపుకుని తెలంగాణ ఉద్యమంలో జాగృతి కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. పలు సమస్యలపై జాగృతి కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. కొన్నేళ్లుగా బీఆర్ఎసతో కలిసి జాగృతి కార్యకర్తలు అనేక ఉద్యమాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అయితే చాలామంది కార్యకర్తలు, నాయకులు జాగృతి కార్యక్రమాల్లో పాల్గొంటూనే బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కవితను పార్టీ నుంచి బహిష్కరించటంతో పార్టీ, జాగృతిలో పని చేస్తున్న కేడర్ సందిగ్ధంలో పడిపోయింది. కవిత కొత్తగా పార్టీని ఏర్పాటు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కవితతో పాటు కొత్త పార్టీలోకి వెళ్లాలా? లేక ఉద్యమం నుంచి కొనసాగుతున్న బీఆర్ఎస్‌లోనే ఉండిపోవాలా? అనే అయోయం నెలకొంది.

**కవిత వెంట నడిచేదెవరు..?**

పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ కవితకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మద్దతుగా నిలిచే బలమైన నాయకులు ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఆదిలాబాద్ నుంచి తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ రంగినేని శ్రీనివాసరావు జాగృతి కార్యక్రమాలను పర్యవేక్షించే వారు కవిత వెంట నడిచేందుకు సుముఖంగా లేనట్లుగా సమాచారం. ఇటీవల కాలంలో కవిత నిర్వహించిన చాలా కార్యక్రమాలకు బీఆర్ఎస్ నుంచి గెలిచి ఓటమి పాలైనవారు దూరంగానే ఉంటున్నారు. ఇటీవల కవిత మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆమె కలవడానికి ఒక్క బీఆర్ఎస్ నేత కూడా రాకపోవడం చర్చకు దారితీసింది.. హైదరాబాద్‌లో కవిత ప్రెస్‌మీట్‌కు ఉమ్మడి జిల్లా నేతలు ఎవరూ హాజరుకాలేదు. ఇక నిర్మల్ జిల్లాలో జాగృతి ప్రభావం అంతగా లేదని ఆ పార్టీ నాయకులేత అంటున్నారు.. కవిత జిల్లాలో పర్యటించిన సందర్భరాలు చాలా తక్కువని దీంతో ఇక్కడి నేతలు సైతం బీఆర్ఎసలో కొనసాగడానికి మొగ్గు చూపటంతో మిగతా వారి పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశంగా మారింది. కుమ్రంభీం ఆసిఫాబాద్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది.. ఇక్కడ ఆసిఫాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి ప్రాతినిథ్యం వహిస్తుండడంతో వారంతా బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.. మిగతా నేతలు కవిత ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని వేచి చూస్తున్నారని సమాచారం. కవిత సొంత పార్టీ పెడుతుందా? లేక ఇతర పార్టీలో చేరుతుందా? అనే ఉత్కంఠ జాగృతి కార్యకర్తల్లో ఉంది. సొంత పార్టీ పెడితే ఏం చేయాలి..? వేరే పార్టీలో చేరితే ఏం చేయాలనేది కవిత తీసుకునే నిర్ణయంపై తాము అడుగులు వేస్తామని కవిత జాగృతి నేతలు పేర్కొంటున్నారు. గతంలో కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎమ్మెల్సీ కవిత వెంట అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే కవిత బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలపై మంగళవారం పలువురు నేతలు కౌంటర్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ కీలక మహిళ నేతలు ఎవరూ కూడా కవిత వెంట వెళ్లే అవకాశం లేదని గులాబీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల్లో ఎవరికీ కవితతో పెద్దగా సత్సంబంధాలు లేవు. పార్టీలో చెప్పుకో తగిన నేతలు కూడా కవితతో టచ్‌లో ఉన్నట్లుగా సమాచారం కూడా లేదు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్సీ కవిత వెంట నడిచేవారు పెద్దగా ఎవరూ లేరనే చర్చ జరుగుతోంది. అలాగే కవిత సింగరేణిలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస)కు గౌవర అధ్యక్షురాలిగా కొనసాగారు. ఇటీవల పార్టీలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా కవితను గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తొలగించి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అప్పగించారు. అయితే దీంతో కవిత వర్గం వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కవిత సింగరేణిలో హెచ్ఎంఎస్‌కు గౌరవ అధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. అయితే కవితతో పాటు టీబీజీకేఎస్ నుంచి పెద్దగా హెచ్ఎంఎస్‌లోకి కేడర్ వెళ్లలేదని టీబీజీకేఎస్ నేతలు పేర్కొంటున్నారు. మొత్తంగా కల్వకుంట్ల కవితతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బీఆర్ఎస్ నేతలు, అనుబంధ సంఘాల నేతలు బయటకు వెళ్లే అవకాశాలు లేవనే చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై కొంత మంది బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు స్పందించగా మరికొందరు దాటవేసేదొరణిలో మాట్లాడుతున్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన నేపథ్యంలో అధిష్టాన నిర్ణయం సరైనదే అని ముఖ్యనేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ నిర్ణయం పార్టీకి లాభమే తప్ప ఎలాంటి నష్టం చేకూర్చదంటున్నారు.

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ, కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ ఎపిసోడ్... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉత్కంఠ రాజకీయాలకు తెరతీసింది. ఊహించినట్టుగానే బీఆర్ఎస్ అధిష్ఠానం కవితను పార్టీ నుంచి గెంటేయడంతో అటు బీఆర్ఎస్, ఇటు జాగృతి శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. తాజా పరిణామాలతో గులాబీ కండువాతో పాటు జాగృతి కండువా కప్పుకుని పని చేసిన నేతలు.. ఎటుపోవాలో తేల్చుకోలేని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. బీఆర్ఎస్‌లో కొనసాగటమా..? జాగృతి వెంట నడవటమా..? అనేది ఉత్కంఠగా మారింది. ఉమ్మడి జిల్లాలోని పలువురు నేతలు జాగృతి కీలకంగా పని చేశారు. తాజా పరిణామాల్లో దృష్ట్యా జాగృతి నేతలు గులాబీ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. జిల్లాల్లోని కవిత అనుచర నేతల స్టాండ్ ఏమిటనేది ఇంకా తేలాల్సివుంది. బీఆర్ఎస్‌లో కీలక నేతలు, అసంతృప్తనేతలు కవిత వెంట నడుస్తారా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.**

## ఆమెతో పార్టీకి నష్టం లేదు..



గతంలోనూ పార్టీ సిద్ధాంతాలను ఉల్లంఘించిన ఎంతటివారి పైనైనా అధినేత క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత విషయంలోనూ పార్టీ అదే తీరుగా వ్యవహరించింది. క్రమశిక్షణకు బీఆర్ఎస్ మారుపేరు. ఈ సస్పెన్షన్‌తో పార్టీకి లాభమే తప్పా.. నష్టమేమీ లేదు.

**-జోగు రామన్న, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

## కవిత ఆరోపణలు సరికాదు..



కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో హరీష్ రావు బలమైన వాదనలు వినిపించారు. అధినేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగానే ఆయన ముందుకు కదిలారు. అలాంటి వారిపై ఆరోపణలు సరికాదు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా అధినేత చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో అందరికీ ఒకే పద్ధతి అని చెప్పడానికి కవిత సస్పెన్షన్ నిదర్శనం.

**- అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే**

# పచ్చిమిర్చితో ఆరోగ్య ప్రయోజనాలు

## రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా, కంటి చూపు మెరుగు

(హెల్త్ డెస్క్ ప్రభాత సమాచారం) పచ్చి మిరపకాయలు కేవలం రుచికి కారంగా మాత్రమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి ఎ, సి విటమిన్లతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా, కంటి చూపును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పచ్చి మిరపకాయలను ఆహారంలో తగిన మోతాదులో చేర్చుకోవడం ద్వారా అద్భుతమైన ప్రయోజనాలను సులభంగా పొందవచ్చంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!



**క్యాన్సర్ నివారిణిగా :**

ఇందులో శక్తివంతమైన సహజ రసాయనాలు ఉంటాయని, ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా శరీరంలోని హానికరమైన కణాల పెరుగుదలను క్యాప్సైసిన్ ఆపుతుందని, కొన్ని రకాల కణాలను నాశనం చేస్తుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. రొమ్ము, కడుపు, పెద్దప్రేగు క్యాన్సర్ కణాలపై ఈ ప్రభావం కనిపించిందని పేర్కొన్నారు.

**బరువు అదుపులో :**

పచ్చి మిరపకాయలు జీవక్రియను వేగవంతం చేసి, ఎక్కువ కేలరీలు ఖర్చయ్యేలా చేస్తాయని, ఇందులో ఉండే క్యాప్సైసిన్ అనే సమ్మేళనం కొవ్వును కరిగించడంతో పాటు కొవ్వు నిల్వలు ఏర్పడకుండా నిరోధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇవి కడుపు నిండిన అనుభూతిని ఎక్కువసేపు కలిగించడం వల్ల అతిగా తినకుండా ఉంటామని, తద్వారా ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి తోడ్పడుతుందని వివరించారు.

**గుండె ఆరోగ్యానికి :**

పచ్చి మిరపకాయలు రక్త ప్రసరణను మెరుగుపరచడం, రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇవి రక్తనాళాలలోని ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయని, తద్వారా గుండె సమస్యల ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు.

**షుగర్ అదుపులో :**

కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదించడంతో పాటు ఇన్సులిన్ ఉపయోగాన్ని మెరుగుపరుస్తుందంటున్నారు. దీనివల్ల శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకుంటుందని, తద్వారా రక్తంలో గ్లూకోజ్ అదుపులో ఉంటుందని పేర్కొన్నారు. మిరపకాయల ద్వారా బరువు తగ్గడం అనేది ఇన్సులిన్ మెరుగైన నియంత్రణ ఫలితంగా కూడా ఉంటుంది. ఇది బరువు నిర్వహణకు మద్దతతో పాటు ఊబకాయం, మధుమేహం, హృదయ సంబంధ రుగ్మతలు వంటి వ్యాధుల చికిత్సకు సానుకూల ప్రభావాలను కలిగి ఉంటుందని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ఓ అధ్యాయంలో పేర్కొంది.







## ఫ్యామిలీ బొనాంజాగా.. నేను రెడీ


నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో హీరోగా పొందిన గుర్తింపు తెచ్చుకున్నారు హవీష్. ప్రస్తుతం నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో 'నేను రెడీ' చిత్రంలో నటిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. నిఖిల కోనేరు నిర్మాత. కుటుంబ కథా చిత్రంగా 'నేను రెడీ' తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా తాజా షెడ్యూల్ - టాకీ పార్ట్ రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రారంభమైంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. వీలైనంత త్వరలో చిత్రీకరణ పూర్తి చేసి సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై దర్శకుడు త్రినాథరావు స్పందిస్తూ.. 'ఇదొక ఫ్యామిలీ బొనాంజా మూవీ. అప్పట్లో 'పెళ్లిసందడి' సినిమాలో ఇండస్ట్రీలోని కమెడియన్స్ అంతా నటించారు. ఇందులో కూడా ఫ్రేమ్ నిండా ఆర్టిస్టులతో కళకళలాడుతుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్, నిజార్ విజువల్స్ బ్యూటిఫుల్‌గా ఉంటాయి. ఈ చిత్రంలో సరదాలు, ఎమోషన్స్ అందర్నీ ఆకట్టుకుంటాయి. ప్రేక్షకులంతా సకుటుంబంగా థియేటర్స్‌కు వచ్చి రెండున్నర గంటలపాటు నవ్వుకుని, చివరి పదిహేను నిమిషాలు ఎమోషన్ ఫీల్‌తో బయటకు వెళ్తారు' అని చెప్పారు.

## 'ఓజి' బర్త్ డే గ్లింప్స్..



టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, యువ దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో వస్తున్న మాస్ యాక్షన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా ఓజి పట్ల అభిమానుల్లో అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ పాన్ ఇండియా లెవెల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి. పవన్ బర్త్‌డే స్పెషల్‌గా మేకర్స్ ఇంకో పెద్ద ట్రీట్ అందించారు. సాధారణంగా ఇలాంటి స్పెషల్ గ్లింప్స్ అన్నీ హీరో సైడ్ నుంచి రావడం మనం చూసే అంశం. కానీ ఈసారి ఓజి మేకర్స్ కొంచెం డిఫరెంట్‌గా ప్లాన్ చేశారు. విలన్ పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ సైడ్ నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ క్రియేటివ్ మూవ్ ఫ్యాన్స్‌కే కాదు, సినిమా లుక్స్‌పై ఆసక్తి చూపుతున్న సినీప్రియులందరినీ ఆకట్టుకుంది. ఇమ్రాన్ హష్మీ స్క్రీన్ ప్రెజెన్స్ ఈ గ్లింప్స్‌లో మాస్ అట్రాక్షన్‌గా నిలిచింది. పవన్‌కు సరితూగే స్ట్రాంగ్ విలన్‌గా ఆయనను చూపించడంలో దర్శకుడు సుజీత్ విజయం సాధించేలా ఉన్నాడు. లుక్స్, బాడీ లాంగ్వేజ్, బిల్డప్ సీన్స్ అన్నీ కలిపి ఇమ్రాన్ నిజంగా పర్ఫెక్ట్ విలన్ మెటీరియల్ అని చెప్పించేశాయి.

## అఖండ 2' రిలీజ్ పై కొత్త బజ్!



గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే అఖండ 2 తాండవం. దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నిజానికి ఈ సెప్టెంబర్ లోనే విడుదల కావాల్సి ఉన్న ఈ సినిమా పలు కారణాలు చేత వాయిదా పడింది. మరి కొత్త డేట్ ఎప్పుడు అనేది ఫ్యాన్స్ లో సస్పెన్స్ గా మారగా ఇప్పుడు ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి డిసెంబర్ స్లాట్ కన్ఫర్మ్ అయినట్టుగా టాక్ వచ్చింది. డిసెంబర్ 5న రాజా సాబ్ ఉంటే అది కాస్తా జనవరికి మారింది. దీనితో ఆ డేట్ ఖాళీ గానే ఉంది కదా అనుకుంటే ఇపుడు అఖండ 2 కూడా జనవరికి షిఫ్ట్ అయ్యే అవకాశం ఉందని కొత్త టాక్ మొదలైంది. మరి ఇది ఎంతవరకు నిజం అనేది చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నాడు అలాగే 14 రీల్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## సమంత మరో కొత్త ప్రయోగం..?



సిటాడెల్ తర్వాత తెలుగులో తన సొంత ప్రొడక్షన్లో చేసిన శుభం సినిమా కోసం క్యామియో రోల్ చేసింది సమంత. ఆ సినిమా కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా కూడా సమంత తన ట్రాలాలా బ్యానర్ నుంచి మంచి ప్రయత్నమే చేసిందని అనిపించింది. ఐతే నెక్స్ట్ ట్రాలాలా ప్రొడక్షన్ నుంచి సమంత లీడ్ రోల్ లో మా ఇంటి బంగారం సినిమా వస్తుంది. ఆ సినిమా షూటింగ్ ఎక్కడివరకు వచ్చిందో అప్డేట్ ఐతే రాలేదు. ఇదిలాఉంటే సమంత నిర్మాతగా మరో మూవీ మొదలు పెట్టబోతున్నట్టు తెలుస్తుంది. నిర్మాతగా సమంత తన మార్క్ చూపించాలని ఫిక్స్ అయ్యింది. ఈ క్రమంలో ఫస్ట్ సినిమా మా ఇంటి బంగారం అనౌన్స్ చేసినా అది వెనక్కి వెళ్లి శుభం సినిమా రిలీజైంది. ఇక నెక్స్ట్ తన బ్యానర్ లో 3వ సినిమా మొదలు పెట్టే పనుల్లో ఉందట సమంత. ఇప్పటికే ఒక కొత్త దర్శకుడు చెప్పిన పాయింట్ కి సమంత ఫిదా అయిపోయిందట. ఫైనల్ వెర్షన్ కథ రెడీ అయ్యాక కాస్టింగ్ ఎంపిక జరుగుతుందని టాక్. సమంత బ్యానర్ నుంచి వస్తున్న థర్డ్ మూవీ కంప్లీట్ డిఫరెంట్ జోనర్ లో వస్తుందట. సినిమా కూడా లిమిటెడ్ బడ్జెట్ తోనే చేయబోతున్నారని టాక్. హీరోయిన్ నిర్మాతగా మారి సినిమాలు చేయడం బాలీవుడ్ లో ఎక్కువగా చూస్తుంటాం. కానీ సౌత్ లో అది కూడా తెలుగు టాప్ హీరోయిన్ గా కొనసాగుతున్న సమంత ఇలా హీరోయిన్ గానే కాదు నిర్మాతగా సినిమాలు చేస్తుండటం ఆమె ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. ఇక తెలుగులో సమంత హీరోయిన్ గా ఖుషి సినిమా చేసింది. మా ఇంటి బంగారం వస్తుందని అంటున్నారు కానీ ఆ సినిమా అప్డేట్ మాత్రం ఇవ్వట్లేదు. సమంత తో రాజ్ అండ్ డీకే మరో బాలీవుడ్ వెబ్ సీరీస్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. సో ఇటు ఓ పక్క సినిమాల్లో నటిస్తూ మరోపక్క ప్రొడక్షన్ బాధ్యతలను కూడా చూసుకుంటుంది సమంత.

"కచ్చితంగా థియేటర్స్‌లోనే చూడాలనిపించే సినిమాలు ఓ ఏడాదిలో చాలా తక్కువగా వస్తుంటాయి. మా 'మిరాయ్' ఆ కోవకు చెందినదే. కుటుంబంతో కలిసి థియేటర్స్‌లోనే చూసే చిత్రమిది" అన్నారు తేజ సజ్జా. ఆయన హీరోగా నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. ఇది ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం చెన్నైలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ.. "ఇది దేశాలు దాటి జరిగే కథ. యాక్షన్, అడ్వెంచర్, ఫాంటసీ, ఎమోషన్, ఎలివేషన్.. అన్నీ ఉన్న చిత్రమిది. పిల్లలు.. పెద్దలు అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇందులో యాక్షన్ చాలా కొత్తగా ఉంటుంది. కార్తీక్ విజన్ వల్లే ఈ సినిమా సాధ్యమైంది. ఆయన కథ చెప్పే విధానం ప్రేక్షకుల కు ఓ గొప్ప అనుభూతిని అందిస్తుంది. దీంట్లోని రాముడి నేపథ్యం కూడా అందర్నీ చాలా ఆశ్చర్యపరుస్తుంది" అన్నారు.



మిరాయ్‌లో ఆశ్చర్యపరిచేలా రాముడి నేపథ్యం




## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

- సమస్యలపై కదంతొక్కిన విద్యార్థి లోకం
- సమస్యలు పరిష్కరించాలని ధర్నా
- విద్యాశాఖకు మంత్రిని నియమించాలి..
- రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినవ్‌లు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఏడేండ్ల నుంచి రూ. 8,641 కోట్ల పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్స్ విడుదల చేయాలని, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని, రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, నూతన విద్య విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీ లో తీర్మానం చేయాలనీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఫీజులపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు వాపోయారు. ఇప్పటి వరకు కనీసం విద్యార్థులకు న్యాయం చేసే విధంగా కనీసం ఒక్క చర్చ కూడా చేయడం లేదని, పెండింగ్ ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం చేయాలనీ కోరారు. ప్రభుత్వం తొమ్మిది నెలలుగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయడం లేదని, గురుకులాలలో యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్ ఇంకా పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, యూనివర్శిటీల సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో ఫీజులను వసూళ్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు వచ్చి విద్యార్థులు వసతిగృహాలు, గురుకులాలు, కెజిబివిల్లో లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. వచ్చే అకాడమిక్ లో నూతన విద్య విధానాన్ని తీసుకు రాబోతుందని, దీని వల్ల పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువు దూరం అయ్యే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. విద్యా వ్యవస్థ ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లి అడ్డగోలుగా ఫీజుల వసూళ్లకు పాల్పడతారని, దీనిని భారత విద్యార్థి ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో నూతన విద్యా విధానన్ని అమలు చేయకుండా తీర్మాణం చేయాలని, లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నిఖిల్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ రత్నవేణి, జిల్లా కమిటీ సభ్యులు భరత్, రాంచరణ్, రామకృష్ణ, హర్షవర్ధన్, ప్రదీప్, ప్రతీక్, విద్యార్థులు పాల్గొన్నారు.



## 42% రిజర్వేషన్లపై సీఎం

# మాట నిలబెట్టుకున్నారు

**కుభీర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు మాజీ శాసనసభ్యులు జీ.విట్టల్ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం పెద్ద సంఖ్యలో హాజరై పటాకాలు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మండల నాయకులు 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు కల్పించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పానాజీ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోనె కళ్యాన్, మాజీ జెడ్పిటిసి శంకర్ చౌహాన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కందూరి సంతోష్, ఏఎంసీ వైస్ చైర్మన్ హైమద్, నాగలింగం, సుది రాజన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటికి ప్రజల గుండెల్లో వైఎస్సార్

## మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం



**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
పేదల ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచారని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం పేర్కొన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్ 16వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉత్తం మాట్లాడుతూ... పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహానేత వైయస్ఆర్ అని తెలిపారు. జీవితాంతం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటు పడ్డారని, కాంగ్రెస్ హయంలో చరిత్రాత్మకమైన పథకాలను అమలు చేశారన్నారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి జహీర్, సోమోరే నాగోరావు, మీర్జా యాకూబ్ బెగ్, సోమాసే కిషోర్ కుమార్, వరుణ్ ఫడ్ పాటిల్, సోన్ కాంబ్లే జితేందర్, ఎండి. జూనేద్, సోన్ కాంబ్లే తదితరులు ఉన్నారు.

# 'కేసీఆర్‌ను బద్నాం చేయడానికి రేవంత్ రెడ్డి కుట్ర'



**బోథ్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తూ కేసీఆర్ ను కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని బోథ్ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాళేశ్వరం పై సి.బి.ఐ విచారణకు వ్యతిరేకంగా మంగళవారం బోథ్, సోనాల మండలాల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మని దహనం చేశారు. ధర్నా చేసి దిష్టిబొమ్మను దాహనం చేసిన నాయకులను పోలీసులు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తులా శ్రీనివాస్ మాట్లాడుతూ కాళేశ్వరం తెలంగాణ ప్రజలకు వరప్రదాయని అని దానివలన కేసీఆర్ కు మంచి పేరు వస్తుందని దురుద్దేశంతో సిబిఐ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు.



## పవన్ ఒక ప్రభంజనం..

# మాట ప్రకంపనం

### జనసేన ఆధ్వర్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

**తలమడుగు, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఎన్ని ఒడిదుడుకులు, అవమానాలు ఎదురైనా అంతిమంగా రికార్డు విజయం సాధించిన పవన్ ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్నారన్నారని శ్రీ అంజనీపుత్ర సేవా సమితి జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ అనిల్ కుమార్ అన్నారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జనసేన పార్టీ నాయకులు, శ్రీ అంజనీపుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసి అక్కడే కేకును కట్ చేసి అభిమాన నాయకుడి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన చేస్తున్న సేవలను ప్రజల వద్దకు తీసుకు వెళ్తూ ప్రజాసేవలో జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎప్పుడు ఉంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ అంజనీపుత్ర సేవా సమితి అధ్యక్షులు అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, పవన్ కళ్యాణ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జక్కుల కార్తీక్ అభిమానులు నాయకులు సందీప్, వినయ్, రవితేజ, సంతోష్, వివేక్, లోకేష్, రాము, రవి, ప్రవీణ్, అక్షయ్, కార్తీక్, జానీ పాల్గొన్నారు.



# మహిళలు, చిన్నపిల్లల రక్షణకే పోలీసు శాఖ తొలి ప్రాధాన్యత



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని మహిళలు, యువతులు ఎవరైనా హింసకు గురి అయినట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ పై షీ టీం, భరోసా టీం మరియు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఏదైనా హింసకు గురి అయినట్లయితే షీ టీంని సంప్రదించాలని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్ట్ నెలలో షీటీం ద్వారా 83 హాట్స్పాట్ ప్రదేశాలను గుర్తించినట్లు, 25 అవేర్నెస్ ప్రోగ్రామ్స్, ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించామని 8 మందిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు, 11 పిర్యాదులలో 3 ఎఫ్.ఐ.ఆర్, 8 కేసులలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. చిన్న పిల్లలు, మహిళల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా మహిళలు ,పిల్లలు హరాస్మెంట్ గురి అయినట్లు గమనిస్తే, పోలీసులను నేరుగా సంప్రదించలేని వారు షీ టీం ని సంప్రదించాలని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 2షీటీమ్‌లు పనిచేస్తున్నా యని, ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670564, కాగజ్నగర్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670565 లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

# చంద్రబాబు చేతిలో సీఎం కీలుబొమ్మ

- సీబీఐ అంటే ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ ఇన్వెస్టిగేషన్ సంస్థ - మాజీమంత్రి రామన్న ఆరోపణ
- కాళేశ్వరంపై ప్రభుత్వ తీరు నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష కొనసాగిస్తోందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తెలంగాణ అస్తిత్వంపై అటు మోదీ, ఇటు సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుతో చేతులు కలిపి ఆదర్శ కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం చిమ్ముతున్నారు మండిపడ్డారు. కేంద్ర ప్రభు త్వ సంస్థలను సైతం బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ సొంతానికి వాడుకుంటు న్నారని, సీబీఐ సంస్థ అంటే ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ ఇన్వెస్టిగేషన్ సంస్థ ఎద్దేవా చేశా రు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంపై కాం గ్రెస్ కుట్రలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే స్థానిక పార్టీ జిల్లా కార్యాలయం నుండి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమురం భీం చౌక్ వద్ద రాస్తా రోకో చేపట్టారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలగ డంతో పోలీసులు మాజీ మంత్రితో పాటు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ... మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తు తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే గొప్ప సంకల్పం తో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్ల ర్లు కుంగిపోవడాన్ని సాకుగా తీసుకుని లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే బహుళార్ధక సాధక ప్రాజెక్టును అబాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. జస్టిస్ ఘోష్ తన నివేదికలో అవాస్తవాలను వండి వార్చారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజె క్టు ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు అవకాశమున్నా కేసీయార్ పేరు ప్రతి స్థలు దక్కుతాయనే అక్కసుతో భూములను బీళ్లుగా మారుస్తున్నారని ఆక్షేపించారు. చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా ఉన్నటువంటి రేవంత్ రెడ్డి మరోసారి చంద్రబాబు నాయుడు మాటలు వింటూ తెలంగాణకు అన్యాయం చేసే పన్నాగం జరుగుతుంది జోగురామన్న ఆరోపించారు. తెలంగాణ విద్యావంతులు మేధావులు మరోసారి తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, దాసరి రమేష్, అలాల్ అజయ్, సాజిదోద్దీన్, రాజన్న, కస్తాల ప్రేమల, దమ్మపాల్, పవన్ నాయక్, సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

---

## ఎడారి దేశంలో
# భైంసా వాసి ఇబ్బందులు

**ఇండియాకు రప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు**



**ముథోల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** తన భర్త దుబాయిలో పనిలేకుండా ఆకలితో అలమటిస్తూ, దుర్భర జీవితం గడుపుతున్నాడని, ప్రభుత్వం స్పందించి అతడిని ఇండియాకు రప్పించాలని భైంసా పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన అన్నపూర్ణ వేడుకుంటోంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన సిలివేరు రితీశ్ మూడేళ్ళ కిందట అబుదాబికి వెళ్లాడు. రెండేళ్ళ అగ్రిమెంట్ పూర్తి కావడంతో అక్కడి నుంచి దుబాయికి వెళ్లాడు. కాగా, పాస్‌పోర్ట్, సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో కొన్ని నెలలుగా అక్కడే ఖాళీగా తిరుగుతున్నాడు. తిండి లేక, ఉండేందుకు చోటు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో అతడు రోదిస్తూ ఇండియాకు పంపాలని వేడుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయం అతడి కుటుంబీకులకు తెలియడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తన భర్తను ఇండియాకు రప్పించాలని అతని భార్య అన్నపూర్ణ ఇటీవల ఎన్ఆర్ అడ్వైజరీ కమిటీ సభ్యులను కలిసి విన్నవించింది. అక్కడి గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి సమాచారం ఇవ్వ డంతో వారు అతడిని కలిసి మాట్లాడారు. ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తన భర్తను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని అన్నపూర్ణ వేడుకుంటోంది. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ఆదుకోవాలని కోరు తోంది. రితీశ్, అన్నపూర్ణ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు.

# బాలికపై 64ఏళ్ల వృద్ధుడి లైంగిక దాడి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** బాలికపై అత్యాచారం చేసి 64ఏళ్ల వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బాలిక స్నానం చేసేటప్పుడు ఫొటోలు తీసి వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరించాడు. దీంతో బాలికను పలుమార్లు అత్యాచారం చేయటంతో బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితునిపై పోక్సో చట్టం కింద, బెదిరింపుల కేసులు నమోదు చేశారు. అనంతరం బాలికను వైద్య పరీక్షల కోసం రిమ్స్ కు తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

# రూ.20లక్షల పరిహారం అందించాలి



- అన్నదాతలకు ఎరువులు అందజేయాలి
- అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్

**చెన్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పట్టించుకునేవారే కరువయ్యారని మాజీ ఎంపీ, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ మంగళ వారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత తీర్చాలని, గోదావరి, ప్రాణహిత నది పరివాహక ప్రాంతాలైన కోటపల్లి మండలంలోని వెంచపల్లి, సూపా క, ఆలుగామ, జనగామ, రొయ్యలపల్లి, సిర్సా, అన్నారం, దేవులవాడ, బబ్బరచెల్క, పుల్లగామ గ్రామాలు, చెన్నూర్ మండలంలోని అక్కెపల్లి, చెన్నూర్, సుందరశాల, బీరెల్లి, పొక్కూరు, నాగాపూర్, జైపూర్ మండలంలోని వేలాల, పౌనూరు, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 20 లక్షల రూపాయలు అందజేయాలన్నారు. రైతులకు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. చెన్నూర్ రెవెన్యూ డివిజన్, బస్సు డిపో, మహిళా భవనాలు, గ్రంథాలయాలు, వందపడకల ఆసుపత్రి పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆస్నాద్, పారుపల్లిలను మండలాలుగా ఏర్పాటు చే యాలని, తదితర నిలిపివేసిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, రైతు, యూత్ డిక్లరేషన్లను అమలు చేయాలన్నారు.



## రాష్ట్రస్థాయి కళోత్సవాలకు
# ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

**మందమర్రి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల పట్టణంలో గత రెండు రోజులుగా నిర్వహించిన కళోత్సవంలో పట్టణంలోని తెలంగాణ మోడల్(ఆదర్శ) పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయిలో బహుమతులు గెలుచుకొని, రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ మంగళవారం తెలిపారు. వోకల్ మ్యూజిక్ సోలో విభాగాల్లో పాఠశాలకు చెందిన ధర్మశాస్త్రి మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా, వోకల్ మ్యూజిక్ గ్రూపు విభాగంలో అక్షిత్ గ్రూప్ రెండవ బహుమతి సాధించిందని, అదేవిధంగా ఫోక్ డాన్స్ గ్రూప్ విభాగంలో ఉజ్వల్ గ్రూప్ మూడో బహుమతిని సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఘనత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ సారా తస్నీమ్, ఉపాధ్యాయులు, అభినందించారు.

# వరద నష్టంపై సమావేశం

**ముథోల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** ముథోల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి సుదర్శన్ రాథోడ్ ఆధ్వర్యంలో వరద నష్టంపై అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో భారీ వర్షాలతో 582 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిం దని వ్యవసాయ అధికారి రచన ప్రాథమికంగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తహశీల్దార్ శ్రీలత మాట్లాడుతూ మండలంలోని పంట నష్టంతోపాటు దెబ్బతిన్న ఇళ్ల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల తోపాటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమ శాఖల పరిధిలో దెబ్బతిన్న రోడ్లు వంగిన విద్యుత్ స్తంభాల వివరాలను అందించారు. అదేవిధంగా పశువైద్యాధికారి మండలంలో భారీ వర్షాలకు సంపదకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పంట నష్టంతోపాటు దెబ్బతిన్న ఇళ్ల వివరాలు, వంగిన విద్యుత్ స్తంభాలు, ఆర్ అండ్ బీ, పంచాయతీ శాఖ రోడ్ల వివరాలను అందించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో శివకుమార్, అధికారులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందిస్తాం : డీసీహెచ్ఎస్ డాక్టర్ సురేష్

**ముథోల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డీసీహెచ్ఎస్ డాక్టర్ సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని సామాజిక ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రి కురవడంతో మందులు తడిసిపోవడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్ప త్రులను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మందులతోపాటు వైద్యులు అందు బాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆస్పత్రికి తాత్కాలిక మరమ్మతులు చేయడానికి అవసరమైన చర్యలు తీసు కుంటామని వెల్లడించారు. 30 పడకల ఆస్పత్రి పనులు సదరు కాంట్రాక్టర్ ప్రారంభించారని బిల్లులు రాకపో వడంతోని ఇన్ని రోజులు పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. భారీ వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతిరోజు 500వరకు ఓపీ పేషెంట్లు వస్తున్నారని తెలిపారు. జిల్లాలో 20డెంగ్యూ కేసులను గుర్తించామని, వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నారని పేర్కొన్నారు. స్థానికులు సైతం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ వనజ, వైద్యులు సాయి సువర్ధన్, జి. రాహుల్ తదితరులు ఉన్నారు.



# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు
- పిల్లలపై లైంగిక నేరాలు నివారించాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయండి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
పిల్లల సంరక్షణ చట్టాల పై అవగాహన కల్పించేందుకే ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర రావు అన్నారు. పిల్లల భద్రత, పోక్సో చట్టం పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం నిర్వహించిన 'రైజింగ్ 2047' కార్యక్రమంలో భాగంగా ఈనెల 2, 3 తేదీలలో రెండు రోజుల నిర్వహించే అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అవగాహన కార్యక్రమానికి సంబం ధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు, చైల్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు



పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల రక్షణ, పోక్సో చట్టంలోని ప్రధాన అంశాలు, ఉపాధ్యాయుల బాధ్యతలు వంటి అంశాలపై చర్చించినారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ 2012 చట్టం పై అవగాహన కలిగి ఉండాలని ఆన్నారు. ఎన్ని చట్టా లు వచ్చిన మనషుల ఆలోచనలో మార్పు రానంత వరకు అన్ని వృధా ఆన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను తెలుసుకోవాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను




మీ పిల్లలుగా భావించి బాల్యాన్ని కాపాడాలని ఆన్నారు. విద్యా సంస్థలన్నీ పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు వెలుగు లోకి వస్తే వెంట నే సంబంధిత అధికారులకు తెలియ జేయాలని సూచించారు. కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌లు మాట్లాడుతూ... పిల్లలపై లైంగిక




నేరాలను నివారించేందుకు రూపొందించబడిన పోక్సో చట్టంపై ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, బాలల సంరక్షణలో ఉన్న ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీబ్లువో మిల్కా, డీఎస్పీ జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ నాయకుల నిరసన

**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చేస్తున్న కుట్రలను నిరసిస్తూ మంచిర్యాల కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంచిర్యాల మాజీ ఎంఎల్ఏ నడిపెల్లి దివాకర్ రావు ఆదేశాల మేరకు నిరసన తెలిపి కాళేశ్వరం ప్రాజెక్ట్ పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఎండగట్టారు. బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ అధ్యక్షులు గాదె సత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## సీబీఐ విచారణ కక్షపూరిత చర్య

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. సీబీఐ విచారణ నిరసిస్తూ.. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు రోడ్డు పై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చట్టబద్ధత లేని ఘోష్ నివేదికతో కాళేశ్వరం పై సీబీఐ విచారణకు ఎలా ఆదేశించారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తూ. బీఆర్ఎస్ పై కుట్రపూర్వక చర్యలకు కాంగ్రెస్ సర్కార్ పునుకుందనీ ఆరోపించారు. కాంగ్రెస్ పాలన వద్దురా.. కేసీఆర్ పాలన ముద్దురా అంటూ నినాదాలు చేశారు.



# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి







**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
వినాయక నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర చేపట్టే రూట్ మ్యాప్ ను స్వయంగా పరిశీలించి, సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిపై అరా తీశారు. అదేవిధంగా విగ్రహాలను నిమజ్జనం చేసే, చందా (టి) వాగు, పెన్ గంగా నది పరిసరాలను పరిశీలించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఘాట్ల వద్ద శుభ్రత, వాహనాల రాకపోకలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత వాతావర ణంలో ఆనందోత్సాహాల నడుమ గణేష్ నిమజ్జనోత్సవం జరు పుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అక్కడ క్కడా చెడి పోయి ఉన్న రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులను కలె క్టర్ ఆదేశించారు. శోభాయాత్రకు ఎలాం టి ఆటంకాలు తలెత్తకుండా రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొల గించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలనుపైకి భిగించాలని సూచించారు. కొన్ని రోజులుగా ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, పెన్ గంగ బ్రిడ్జ వద్ద నది ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని విగ్రహాల నిమజ్జనం కోసం సరిపడా క్రేన్లను అందుబాటులో ఉంచాలని, తగిన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, జనరేటర్, అంబులెన్సు, మెడికల్ క్యాం పులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదే శించారు. నిమజ్జనోత్సవంలో ఏ చిన్న అపశ్రుతి జరగకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచిం చారు. వినాయక నిమజ్జన శోభాయాత్రకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావ రణంలో ఆనం దోత్సాహాల నడుమ శోభాయాత్ర నిర్వహించుకోవాలని ఎస్పీ సూచిం చారు. ప్రధానంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కార ణంగా, నీటిలో మునిగి గల్లంతు కావ డం, రోడ్డు ప్రమా దాలకు గురి కావడం వంటి ఘటనలు ఎక్కువగా జరిగేం దుకు ఆస్కారం ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు శాఖ సిబ్బందితో అన్ని శాఖలు సమన్వయం చేసుకుని, వా రి సూ చనలు పాటిస్తూ, నిర్దేశించిన మార్గం మీదుగా శోభాయాత్ర జరపాలని గణేష్ మండపాల నిర్వాహకులను కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీఓ స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను సర్వే చేసిన అధికారులు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు సర్వే చేశారు. చాకెపల్లి, చంద్రవెల్లి గ్రామాలలో నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ సందర్శించారు. పాత బెల్లంపల్లి, ఆకెనపల్లి గ్రామాల్లో నీట మునిగిన పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ సర్వే చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. నష్టపోయిన రైతులు సర్వే చేయించుకున్నట్లయితే సంబంధిత ఏఈఓను గాని తనని గాని సంప్రదించాలని సూచించారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**



కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 34 మందిని పరీక్షించగా అందులో 24 గురికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించబడునని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ అభివృద్ధి దిశగా చర్యలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

వ్యవసాయ సాగును సులభతరం చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, బ్యాంకింగ్, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులతో వ్యవసాయ యాంత్రికరణ, జాతీయ ఆహార భద్రత పథకం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల శారీరక శ్రమను తగ్గించి వ్యవసాయ సాగులో పనిముట్ల వినియోగాన్ని పెంపొందించి పంట సాగును సులభతరం చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో 2025 - 26 సంవత్సరానికి గాను పథకం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని మండలాలలో లబ్ధిదారుల ఎంపికకు కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మొక్కల



సంరక్షణ, ట్రాక్టర్ సహాయ పరికరాలతో పాటు వివిధ రకాలైన పరికరాలను వినియోగించి జిల్లాలోని 3 వేల 458 హెక్టార్లలో పంట సాగు కొరకు 2 కోట్ల 35 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ పథకంలో ఎస్.సి.,ఎస్.టి., మహిళా రైతులు, చిన్న కమతాల రైతులకు 50 శాతం రాయితీ, పెద్ద కమతాలు, మిగతా రైతులకు 40 శాతం రాయితీతో పరికరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ ఆహార భద్రత, పోషణ పథకం క్రింద 2025 - 26 సంవత్సరానికి గాను వానాకాలం 2025, యాసంగి 2025-26 గాను 4 వేల 432 హెక్టార్లలో వరి ధాన్యం, పప్పు ధాన్యాలు, పత్తి పంటలు సాగు చేసేందుకు 57 లక్షల రూపాయలతో లక్ష్యాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం క్రింద వానాకాలం 2025 కు గాను 100 శాతం రాయితీతో 24 క్వింటాళ్ల వరి (డెమో), 50 శాతం రాయితీతో 66.8 క్వింటాళ్ల వరి (సాధారణ) విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఈ పథకం అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వరి విత్తనాలతో పాటు సేంద్రియ ఎరువులు, పి.పి. కెమికల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంపొందించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు రిపోర్ట్



### 'మత్తడివాగు' రెండు గేట్లు ఎత్తివేత

**తాంసి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే మండలంలోని వడ్డాడి సమీపంలోగల మత్తడివాగు ప్రాజెక్ట్ లోకి వరదనీరు చేరి నిండుకుండలా మారింది. వర్షాలతో ప్రాజెక్టోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్లో వస్తుండగా అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువ జాము వరకు కురిసిన వర్షానికి ప్రాజెక్టోకి వరదనీరు రావడంతో రాత్రి నుంచి ఉదయం వరకు రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. 1,440 క్యూసెక్కుల ఇన్ వస్తుండగా రెండు గేట్లు ఎత్తి 2,005 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా, 276.80 మీటర్లు నిల్వ ఉండేలా నీటిని దిగువకు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.


### 'స్వర్ణ' మూడు గేట్లు ఎత్తివేత



**సారంగాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తింది. 10,200 ఇన్‌ఫ్లో వస్తుండగా అప్రమత్తమైన అధికారులు మూడు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు కాగా, 1182.2 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు.

### కడెం ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత



**కడెం, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

కడెం ప్రాజెక్టుకు మంగళవారం తెల్లవారుజామున 1,01,385 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఇరిగేషన్ అధికారులు తొమ్మిది వరద గేట్లు ఎత్తి 99,852 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి వరకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు ద్వారా 10,472 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.400 అడుగుల నీటిమట్టం ఉంది.

### 'సాత్నాల' నుంచి నీటి విడుదల

**సాత్నాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాత్నాల ప్రాజెక్ట్‌కు భారీగా వరదనీరు చేరుతోంది. మంగళవారం 1,560 క్యూసెక్కులు రాగా, 1,560 క్యూసెక్కులను ఒక గేటు ద్వారా వదిలిపెట్టినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం1.046 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.



# ఆదిలాబాద్‌లో దంచికొట్టిన వాన

### ఉట్నూర్‌లో 10.7 సెంటీ మీటర్లు నమోదు



**ఉట్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉట్నూర్‌లో అధికంగా 10.7 సెంటీమీటర్ల వర్షం పడింది. ఇచ్చోడలో 10.3, ఆదిలాబాద్ రూరల్ మండలంలో 10.2, గుడిహత్నూర్‌లో 9.6, తలమడుగులో 9.2, మావలలో 8.8, నార్నూర్‌లో 8.6, సిరికొండలో 8.5, తాంసిలో 7.4, బజార్‌హత్నూర్‌లో 6.7, బేలలో 6.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తర్నం వాగు పొంగి ప్రవహించడంతో జైనథ్, బేల మండలాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

## పెట్రోల్ పంపు తనిఖీ చేసిన జీసీసీ డిఎం



**నార్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నార్నూర్ మండల కేంద్రంలోని పెట్రోల్ పంపుని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఇంచార్జి డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపు నీరు డీజిల్, పెట్రోల్ ట్యాంక్ లలో చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించి, సూచనలు చేశారు. రికార్డులు ఎపటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు.

## పొంగి పొర్లిన తర్ణం వాగు

### నిలిచిపోయిన రాకపోకలు

**సాత్నాల, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

భోరజ్ మండల పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలికంగా నిర్మించిన లోలెవెల్ వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి 353 బీపై సోమవారం అర్ధరాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనుల కోసం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు గంటల తరబడి వాహనంలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డుపై కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.





## కాంగ్రెస్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌కు సన్మానం

**జైనూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నూతనంగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా నియమితులైన షేక్ ఫజల్‌ను జైనూర్‌లో సన్మానించారు. మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు, మండల అధ్యక్షుడు షేక్ మూకీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు మెస్రం అంబాజి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఫేరోజ్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కానక గంగారాం, షన్ రైస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షేక్ జమీల్, మండల నాయకులు పెందుర్ ప్రకాష్, సయ్యద్ వసిం, దౌలత్, జాలిమ్ పాల్గొన్నారు.



## వాగు ఉప్పొంగి
# ఆదివాసీల అవస్థలు

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాలకు వాగులో నీటి ప్రవాహం పెరిగి మండలంలోని మామిడిగూడ (జీ), మామిడిగూడ (బీ) గ్రామాల ఆదివాసీలు ఇబ్బంది పడ్డారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన వారసంతకు ఆ యా గ్రామాల వారు వచ్చారు. సరుకులు తీసుకుని తిరిగి వెళ్తుండగా సాయంత్రం భారీ వర్షం కురిసి ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న వాగులో వరద ఉధృతి ఎక్కువైంది. దీంతో వారు వాగు ఇవతలి ఆంజీ గ్రామపంచాయతీ పరిధిలోని ఆంధమామిడిగూడ గ్రామంలోనే ఉండిపోయారు. తిండి లేక ఇబ్బంది పడ్డారు. చలిమంట వేసుకుని తెల్లవార్లు గడిపారు. మంగళవారం ఉదయం వాగులో కొంత ప్రవాహం తగ్గడంతో ఒకరినొకరు పట్టుకుని వాగు దాటి ఆ యా గ్రామాలకు వెళ్లారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణాని కి గత ప్రభుత్వం రూ. 3.5కోట్లు మంజూరు చేసినా అధికారులు, ప్రజాపతినిధుల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభించలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వర్షాలు తగ్గిన వెంటనే వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



# సమన్వయంతో పనిచేసి లక్ష్యాలు సాధించాలి





- సమన్వయంతో పనిచేసి లక్ష్యాలు సాధించాలి
- రోజుకు 2.10 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరగాలి
- ఏరియా జీఎంలకు సీఎండీ బలరామ్ స్పష్టీకరణ

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

సింగరేణి ప్రతి విభాగం వారు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని.. అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో ఆయన బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టుల పురోగతిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు రంగంలో పోటీని ఎదుర్కోవడానికి నాణ్యత పెంపు, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా అన్ని ఏరియాల్లోనూ దుబారాను నివారించి పొదుపు పాటించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఉత్పత్తికి విఘాతం కలిగిందని, జరిగిన నష్టాన్ని పూడ్చుకుని, ప్రస్తుత లక్ష్యాలను సాధించడానికి ఇకపై రోజుకు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.10 లక్షల బొగ్గు రవాణా సాధించాలని లక్ష్యం నిర్దేశించారు. రోజుకు 12.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలన్నారు. వర్షాకాలం ఓపెన్ కాస్ట్ గనుల ఉత్పత్తి పై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో భూగర్భ గనుల్లో ఉత్పత్తిని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. యంత్రాల వినియోగాన్ని పెంచాలని, ప్రతీ ఒక్క ఉద్యోగికి కేటాయించిన 8 గంటల షిఫ్ట్ సమయాన్ని కంపెనీ ఉత్పాదకతకు వినియోగించేలా చూడాలన్నారు. కొత్త ప్రాజెక్టుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణ విషయంలోనూ ఎస్టేట్స్ విభాగం అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలని, రికార్డులను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ ఏడాది ప్రారంభించనున్న కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని అనుమతులు వెంటనే సాధించాలన్నారు. కొత్తగూడెంలో వీకే కోల్ మైన్, ఇల్లందులో జేకే ఓసీ గనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది ప్రారంభించదలచుకున్న మూడు గనుల వల్ల 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, అలాగే వచ్చే ఏడాది ప్రారంభించాలనుకుంటున్న గనుల వల్ల మరో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తిని పెంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని వీటి అనుమతుల పురోగతిపై రోజు వారీగా సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఎం.తిరుమలరావు, ఈడీ కోల్ మూమెంట్ బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్), టి.శ్రీనివాస్, జీఎం(సీపీపీ) ఎ.మనోహర్, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.



## రూ. 1.06 లక్షలకు చేరిన
# బంగారం ధర

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

దేశంలో బంగారం ధరలు అందనంత ఎత్తుకు దూసుకెళ్తున్నాయి. ఈ వారంలోనే తొలిసారి పసిడి ధరలు రూ. 1,05,000 మార్కును దాటాయి. తాజాగా మంగళవారం మరోసారి సరికొత్త ఆల్‌టైమ్ హై స్థాయిలకు చేరాయి. ఇండియా బులియన్ అసోసియేషన్ ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 1,06,240 వద్ద ఉంది. హైదరాబాద్ మార్కెట్‌లో పది గ్రాములు రూ. 1,06,170 (అన్ని పన్నులు కలిపి) జీవితకాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి రూ. 97,050 వద్దకు చేరింది. వెండి ధరలు కిలోకు రూ. 1,36,100 వద్ద ఉంది. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం, భారత కరెన్సీ రూపాయి బలహీనపడటంతో బంగారం ధరలు కొత్త గరిష్ఠాలకు చేరాయి. ఇదే సమయంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధ అవకాశాలు పెరగడంతో పాటు, చైనా లాంటి పలు సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం ధరల పెరుగుదలను ప్రభావితం చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సెప్టెంబర్‌లో రేట్ల తగ్గింపు ఉండొచ్చని సంకేతాలిచ్చింది. దీంతో బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు. 25 బేసిస్ పాయింట్ల కోతకు 86 శాతం అవకాశం ఉందని అంచనాలు రావడంతో పసిడి ధరలు వేగంగా పెరిగాయి. ప్రస్తుత పరిణామాల మధ్య బంగారం రూ. 1,06,400 నుంచి రూ. 1,08,000 మధ్య స్థిరంగా కొనసాగవచ్చని నిపుణులు అంచనా.

# కాంగ్రెస్ పార్టీవి కుట్ర రాజకీయాలు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌వి కుట్ర పూరిత రాజకీయాలు అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని చెప్పారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా అద్భుతంగా పని చేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పుడు పలచటి పునాదులతో కూడిన ప్రాజెక్టుగా చిత్రీకరించడం వెనుక దుర్బుద్ధి ఉందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయాలకు వాడుకుని తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, పెంటు, వనజ, శంకరమ్మ, కలాం, రవీందర్, అజయ్, జీవన్, రవి, సందీప్, నిసార్, అశోక్, అశోక్, పాల్గొన్నారు.



**సిర్పూర్(టి) :** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ ఆదేశాల మేరకు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు అస్లంబీన్ హసన్ మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంతో అన్ని విధాల విఫలమైందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై కమలాకర్ వారితో ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జైనూర్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్ లాలా, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, మాజీ సర్పంచులు భీంరావ్, మాస్రాం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

**కెరమెరి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానం ద్వారా కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే జీవో .51ని రద్దు చయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సిబ్బంది సంతోష్, రాజేష్, హీరాజీ, పాండు, బాలు, అనీల్, శ్రీకాంత్, జైవంత్ తదితరులు పాల్గొన్నారు.

**జైనూర్ :** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మల్టీపర్పస్ వర్కర్లు చేపడుతున్న నిరసన మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నది. రెండో రోజూ ఆసుపత్రి ఆవరణంలో ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపెందర్ మాట్లాడుతూ ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్లు ఎలాంటి ఆర్డర్ కాపీలు లేకుండా పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాలా, నాయకులు అడె లక్యా నాయక్, మాజీ సర్పంచులు మడావి భీంరావ్, మేస్రాం రాహుల్, మాజీ డైరెక్టర్ గేడాం లక్ష్మణ్ తదితరులు పాల్గోన్నారు.కార్యక్రమంలో వర్లు దేవరావ్, మారుతి, శంకర్,సందీప్, రాహుల్, కళావతి, రంభ, లలిత, సుజాత, రజనీకాంత్, పరమేశ్వర్, దినేష్ పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చింతలమానేపల్లి మండలంలో పని చేస్తున్న పంచాయతీ వర్కర్లు మంగళవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కర్లు విలాస్, సంజీవ్, డి.విలాస్, గణేష్, పాల్గొన్నారు.

**బెజ్జూరు :** మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వసంత్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**కౌటాల :** గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్లు ఎంపీడీఓ వినతి పత్రం అందజేశారు. ప్రమాదానికి గురైన కార్మికులకు రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వర్కర్లు పాల్గొన్నారు.

# పంట నష్ట బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

## మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



**దండేపల్లి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

గోదావరి ఎగువ ప్రాంతం నుంచి వరదతో మంచిర్యాల నియోజక వర్గంలో పంట నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు. మంగళ వారం దండేపల్లి మండలంలోని గోదావరి నది సమీప గుడిరేవు, లక్ష్మీ కాంతపూర్ గ్రామాలలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, వెంటనే స్పందించి ఎకరానికి 40 వేల రూపాయల నష్ట పరిహారం అందించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు.

# ఐటీడీఏ ద్వారా కూరగాయల విత్తనాల పంపిణీ

**గాదిగూడ, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

గిరిజన రైతులు కూరగాయల సాగు ద్వారా మంచి ఆదాయం పొందాలి అని, వారికి కావలసినటువంటి సాంకేతిక సలహాలు, సహాయ సహకారాలు అందిస్తామని ఐటిడిఏ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గాదిగూడ మండల కేంద్రం లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు శిక్షణా కార్యక్రమం లో పాల్గొని వివిధ రకాల కూరగాయల సాగు గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 500 మంది ఆదిమ గిరిజన రైతులకు ఐటిడిఏ ద్వారా సీసీడీపీ నిధులతో కూరగాయల మినీ కిట్స్ (చిరు సంచి) ఇవ్వడం జరిగిందని చెప్పారు. 10 రకాల కూరగాయలు కలిగినటువంటి ఈ కూరగాయల సంచి ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి శ్రీమతి ఖుష్బూ గుప్తా చొరవతో ఇస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. సద్వినియోగం చేసుకునే రైతులకు మరిన్ని పథకాలను ఉద్యాన శాఖ ద్వారా వారికి అందజేసి వారి ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం గాదిగూడ మండలం సీడ్వాయి గ్రామంలో ఐటీడీఏ సహకారం తో సాగు చేస్తున్న మామిడి తోట, కూరగాయల సాగు మరియు జంగుబాయి గూడా గ్రామం లో 15 మంది కలిసి సామూహికంగా సాగు చేస్తున్న కూరగాయ పంటలలి ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 120 మంది రైతులకు కూరగాయ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఫ్ ఎన్జీఓ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్స్ శారుఖ్, దిలీప్, కవిత, సిబ్బంది శ్రీరామ్, సురేష్, న్యాను, అరుణ, అనసూయ, సీమతి, జగ్గారావు, అబ్దుల్, 120 మంది కొలాం రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# వెంటనే రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) జిల్లాలో ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా రహదారులపై గుంతలు పడిన చోట్ల మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కసాబ్ వాడి వార్డులో మంగళవారం అంతర్గత రహదారులు, మురికి కాలువలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారులపై ఏర్పడిన గుంతలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని చెప్పారు. ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని, ప్రతి రోజు చెత్తను సేకరించాలని తెలిపారు. అనంతరం గౌడవెల్లి వద్ద పెద్దవాగులో నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. పట్టణంలోని వినాయకులను నిమజ్జనం కోసం ఇక్కడికే తీసుకు వస్తారని, భక్తులకు, వినాయక శోభాయాత్ర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి చదును చేయాలని చెప్పారు. నిమ్మజన ప్రదేశం వద్ద వాహనాలు తిరిగే విధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిరంతరం వెలుతురు ఉండే విధంగా లైట్లు ఏర్పాటు చేయాలని, వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం క్రేన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జనం రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గజానన్, తదితరులు ఉన్నారు.





## ముధోల్‌లో ప్రారంభమైన
# గణేష్ శోభయాత్ర
### ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు

ముధోల్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో మంగళవారం మధ్యాహ్నం గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. ముందుగా రామాలయంలో ఏర్పాటు చేసిన సర్వజనిక్ గణేష్ మండపంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీలు, ఉత్సవ సమితి సభ్యులు, బిడిసి, గణేష్ మండప నిర్వాహకులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. ముధోల్‌లోని ఆయా గల్లీలో గణేష్ విగ్రహాలను వాహనంలో అలంకరించి, యువకుల, పిల్లల నృత్యాలు, మధ్య శోభాయాత్ర సాగింది. పోలీసుల భారీ బందో బస్తు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో భైంసా ఏ ఎస్పీ అవినాష్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఎఎస్పీలు, 6గురు సిఐలు, 20 మంది ఎస్ఐ లు, 200 మంది స్పెషల్ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## యూరియా కోసం రైతుల ఇక్కట్లు




లక్షెట్టిపేట, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) మండలంలోని రైతులకు సమయానికి యూరియా అందకపోవడంతో రైతులు మంగళవారం ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల నుంచి స్థానిక జెండా వెంకటాపూర్ సహకార సంఘ భవనం వద్ద క్యూ లైన్ పద్ధతిలో యూరియా తీసుకుంటున్నామని తెలిపారు. యూరియా కోసం వెళితే ఎప్పుడు వస్తాయో ఏమో అని పట్టింపు లేని సమాధానాలు అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను అర్థం చేసుకుని సహకార సంఘం అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# దేశీ దారు పట్టివేత

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని మంగళవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి కాగజ్ నగర్ పట్టణానికి అక్రమంగా దేశీదారు తరలిస్తున్న వచ్చిన సమాచారం మేరకు బస్సు స్టాప్ ఏరియాలో తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఎంహెచ్ 34ఏపి 1706 నెంబర్ గల కారును ఆపి తనిఖీ చేయగా 1.050, 90 ఎంఎల్ దేశీదారు మద్యం లభ్యమైంది. సుమారు 63 వేలు ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని మహారాష్ట్రకు చెందిన విశాల్, దినేష్ మిత్రులతో మరో కరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



## కాశీ విశ్వనాథ ఆలయానికి
# 300 స్టీల్ ప్లేట్లు వితరణ



కుభీర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పల్సిలోని శ్రీ కాశీ విశ్వనాథ ఆలయానికి అదే గ్రామానికి చెందిన తహసీల్దార్ పి రమణ మంగళవారం300 స్టీల్ ప్లేట్లు ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. తన అమ్మమ్మ కీ. శే.కండెల బుచ్చక్క స్మారకార్థం ఆలయంలో ప్లాస్టిక్ ప్లేట్లను పూర్తిగా నిషేధించాలన్న సంకల్పంతో ఆయన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఈ ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. ఇదిలా ఉండగా కుభీర్ కు చెందిన పుప్పాల సుభాష్ మరో 200 స్టీల్ ప్లేట్లు అందజేశారు. మొత్తం 500 స్టీల్ ప్లేట్ల విలువ సుమారు రూ. 25 వేలు ఉంటుందని తెలిపారు. దీంతోపాటు వినాయక నిమజ్జనం రోజైన శనివారం అన్నదానం కోసం అయ్యే ఖర్చులు ఉప్పల సుభాష్ భరిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాములు, ఇజాప్ అనిల్, శ్రీనివాస్, సభ్యులు ఉన్నారు.

## రైతులకు ప్రభుత్వం
# అండగా ఉంటుంది

కుభీర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకుంటుందని మండల రైతాంగానికి ముధోల్ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన మండలంలోని కస్ర, కస్ర తండా, వర్ని, సోనారి తదితర గ్రామాలలో దెబ్బతిన్న పంటలను ఆయన మండల నాయకులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈపాటికి ప్రాథమిక అంచనాలను తయారు చేశారని సర్వే నిర్వహించి పూర్తి రిపోర్టును ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భైంసా ఆత్మ చైర్మన్ సిద్ధంవార్ వివేకానంద, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బషీర్, పార్టీ సీనియర్ నాయకులు కొట్టె హనుమాన్లు, బంక బాబు, పార్టి (బి) నరేందర్, శంకర్ చంద్రే, నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.





## ఆర్పీఐ(ఏ) జిల్లా అధ్యక్షుడిగా
# రహమత్ ఖాన్ ఎన్నిక

మందమర్రి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అతవాలే) పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షునిగా పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన ఎండి రహమత్ ఖాన్, జిల్లా కార్యదర్శిగా కాసిపేట మండలం కోమటిచేను కు చెందిన దర్శనాల వెంకటస్వామి లను నియమిస్తూ ఆర్పీఐ(ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షులు తుగిపిండి రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పట్టణ ప్రెస్ క్లబ్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. జిల్లా నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నెలకొన్న స్థానిక, ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం అయ్యేవరకు ఉద్యమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో, గ్రామాల్లో కమిటీలను వెంటనే నియామకం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు నాయకులు సిద్ధం కావాలని కోరారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులు రహమత్ ఖాన్, వెంకటస్వామిలు మాట్లాడుతూ మాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బాధ్యతలు ఇచ్చినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసి జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టేందుకు కాంగ్రెస్ కుట్ర



తాండూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణను కోరుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దానిని ఉపసంహరించుకోవాలని నిరసిస్తూ బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కేంద్రంలో నిరసన తెలిపారు. సిబిఐ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని ఎండబెట్టే కుట్ర చేస్తుందని ఆరోపించారు. గోదావరి జలాలను వేరే ప్రాంతానికి తరలించేలా పాలక ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని దానిపై ఆరోపణలు చేసినందుకే ఇలాంటి తప్పుడు నివేదికలు పంపి తమ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు ఉపసంహరించుకోకపోతే తెలంగాణ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తమూర్తి, నాయకులు పూసాల ప్రణయ్ కుమార్, దత్తాత్రేయరావు, ఎలుక రామ్ చందర్ మాసాడి శ్రీరాములు, బోసగిరి చంద్రశేఖర్, మద్దిబోయిన అర్జున్, జాడి పోశం, అబుసాదు, బాబు ఖాన్, హనీఫ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

వాంకిడి, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం) అక్రమంగా గంజాయి విక్రయాలు. సాగు చేస్తున్న ఓ వ్యక్తిని సోమవారం రాత్రి వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బనర్ కోసార్ గ్రామానికి చెందిన జట్టి అనిరుధ్ గంజాయి సాగుచేస్తూ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేయగా 8 గంజాయి మొక్కలతో పాటు 440 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. గంజాయి స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.









# పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఖానాపూర్ మండల కేంద్రంలోని పలు గ్రామాలని సందర్శించిన ఎమ్మెల్యే
- భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంటలను మరియు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ మండల కేంద్రంలోని బావాపూర్, గోసంపల్లి, గోడల పంపు, దిల్వార్పూర్ గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను మరియు భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంటలను పరిశీలించడం జరిగింది,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంటను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందజేస్తామని రైతులు ఎవరు కూడా ఆందోళన చెంద వద్దని అధికారులతో కలిసి పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించామని అలాగే వరద ప్రభావిత ప్రాంతాలను గ్రామస్తులతో కలసి అధికారులతో పాటు పరిశీలిస్తూ పంట పొలాల్లోకి వరద నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ప్రజల మధ్యలో అందుబాటులో ఉండాలని ఆదేశాలను జారీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణ పనులను వేగిరం చేయాలి

**కడెం, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

గంగాపూర్లో నిర్మిస్తున్న వంతెన వంతెన నిర్మాణ పనులను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం వల్ల గంగాపూర్,అల్లంపల్లి గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయని అన్నారు. వంతెన నిర్మాణ పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎటువంటి పొరపాటు చేసిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.





# బాలల హక్కుల పరిరక్షణ, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి

## జూనియర్ సివిల్ జడ్జి పొన్నపల్లి మౌనిక





**ఉట్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

బాలల హక్కుల పరిరక్షణ, బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జూనియర్ సివిల్ జడ్జ్ పొన్నపల్లి మౌనిక అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా డబ్ల్యు.సి.డి., ఎస్.సి. శాఖ ఆధ్వర్యంలో ఉట్నూర్ డివిజనల్ పరిధిలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు పి.ఎం.ఆర్.సి. భవనంలో ఏర్పాటు చేసిన 2 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఎ.ఎస్.పి. కాజల్ సింగ్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ బాలల భద్రతకు చేపట్టవలసిన అంశాలు, ఫోక్సో చట్టం ప్రాధాన్యతను శిక్షణ తరగతులలో ఉపాధ్యాయులు తెలుసుకోవాలని, 18 సంవత్సరాల లోపు వయసుగల బాలబాలికలు ఈ చట్టం పరిధిలోకి వస్తారని తెలిపారు. బాల్యం దశలోనే లైంగిక వేధింపులు, శారీరక సంబంధాలు, గుడ్ టచ్ - బాడ్ టచ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. బాలబాలికలు అధిక సమయం పాఠశాలలోని కేటాయిస్తారని, ఈ నేపథ్యంలో విద్యార్థుల ప్రవర్తనలో ఏమైనా మార్పులు వచ్చినట్లయితే వారితో మాట్లాడి కౌన్సిలింగ్ ఇవ్వాలని, చట్టంలో పేర్కొన్న విధంగా అమ్మాయి/అబ్బాయి ఆరోపణలు ఎదుర్కొంటే వెంటనే సంబంధిత పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. లైంగిక వేధింపులను ఉద్దేశపూర్వకంగా దాచినా అట్టి వారిపై శిక్షలు ఉంటాయని, విద్యార్థులు ధైర్యంగా ముందుకు వచ్చి వేధింపులను తెలియజేసే విధంగా వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఏ స్థాయి వేధింపులైన శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు భద్రత, మానసిక ప్రశాంతత కల్పించడం ద్వారా వారి కలలను సాకారం చేసుకునే విధంగా తోడ్పాటు అందించాలని తెలిపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బాలలపై వేధింపులు జరిగినప్పుడు సామాజికంగా సమస్యలు ఎదురవుతాయని భయపడకుండా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు బాలబాలికలకు అవగాహన కల్పించి ప్రోత్సాహం కల్పించాలని తెలిపారు. ఎ. ఎస్. పి. మాట్లాడుతూ ప్రతి నెల రోజులకు కనీసం 2/3 కేసులు ఫోక్సో చట్టం క్రింద నమోదు అవుతాయని, సోషల్ మీడియా, మొబైల్ ప్రభావంతో లైంగిక వేధింపుల సంఘటనలు అతి చిన్న వయసులో పాల్పడడం ద్వారా బాల్యం ఉన్నత ఆశయాలను కోల్పోవడమే కాకుండా జైలు జీవితం ద్వారా వారి తల్లిదండ్రులకు బాధను కదిలిస్తారని, ఇలాంటి చర్యలు జరగకుండా ఉపాధ్యాయులు విద్యార్థులతో సన్నిహితంగా ఉంటూ బాల్యం నుంచి సన్మార్గంలో నడిచే విధంగా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ. ఉమ, ఎ.సి.ఎం.ఓ. జగన్, బాలల పరిరక్షణ అధికారి రమణ, శిక్షణ రిసోర్స్ డాక్టర్ రాము, సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## బీఈడీ కళాశాలలో బోధన బోధ నేతర

# సిబ్బందిని సబ్ కమిటీలో చేర్చాలి



**ఉట్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

బీఈడీ కళాశాలలో బోధన బోధ నేతర సిబ్బందిని సబ్ కమిటిలో చేర్చాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సీఎం రేవంత్ రెడ్డి ని కోరారు. మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యేతో కలిసి ముఖ్యమంత్రిని కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రోడ్ల మరమ్మతులకు త్వరలో నిధులు విడుదల చేయాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పలు రోడ్లు కోతకు గురయ్యాయని వాటితో పాటు పలువురు రైతుల పంటలు నీట మునిగాయని పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం త్వరలో చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. ఉట్నూర్ భద్రాచలంలోని బిఈడి కళాశాలలో బోధన బోధనేతర సిబ్బందిని సబ్ కమిటీలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గానికి ప్రత్యేక ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లు కోత కు గురయ్యాయని దాంతో ప్రజలు వేరే గ్రామాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తీసుకెళ్లారు. త్వరగా రైతులకు నష్టపరిహారం మరియు రోడ్డు మరమ్మత్తులకు నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. సీఎం మాట్లాడుతూ త్వరలోనే సమస్యలు పరిష్కారం అయ్యేలా రైతులకు నష్టపరిహారంతో పాటు రోడ్ల మరమ్మత్తులకునిధులు కేటాయిస్తారని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

## బ్యాంక్ స్కాంలో మరో 3 కిలోల బంగారం రికవరీ

**చెన్నూర్, సెప్టెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లో జరిగిన భారీ కుంభకోణంలో 25.17 కిలోల బంగారు ఆభరణాలు అపహరణకు గురైన విషయం తెలిసిందే. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇప్పటికే 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. మిగతా బంగారాన్ని రికవరీ చేసేందుకు దర్యాప్తు చేస్తున్న పోలీసుల ప్రైవేట్ ఫైనాన్స్‌లపై దాడులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాలలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో మరో మూడు కిలోలు, చెన్నూర్ ముత్తూట్ ఫైనాన్స్‌లో రెండు గ్రాముల బంగారు ఆభరణాలను చెన్నూర్ సీఐ దేవేందర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు రికవరీ చేసినట్లు సమాచారం.